# సిపిఐ(ఎం)కు ఓటెయ్యండి

## వామపక్షాల్ని బలపర్చండి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

# ఎన్నికల ప్రణాళిక

**16వ లోక్‌సభ ఎన్నికలు 2014**

# ప్రథమ భాగం

## పరిచయం

భారతదేశ ప్రజలు 16వ లోక్‌సభను ఎన్నుకోబోతున్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై పలు వైపుల నుంచి దాడి జరుగుతున్న తరుణంలో ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. రాజకీయాల్లో ప్రవేశించిన అపార ధనం ప్రజాస్వామ్యాన్ని నానాటికీ బలహీనపరుస్తోంది. ప్రభుత్వంలోని ఉన్నత స్థానాల్లో , ప్రజాజీవితంలో ప్రబలిన అవినీతి ప్రజాస్వామ్య వ్యవస్థ జవజీవాలను హరించివేస్తోంది. బడా వ్యాపార సంస్థలు, విదేశీ ఆర్థిక సంస్థలు, వెన్నెముక లేని పాలకులు, ఉన్నతాధికారులు కుమ్మక్కై ప్రభుత్వ విధానాలు ఎలా ఉండాలో నిర్ణయిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వం ఒక దశాబ్ద కాలం నుంచి అమలు చేస్తున్న నయా ఉదారవాద విధానాలు ఫలితంగా దాపురించిన ఈ దుస్థితి మన పార్లమెంటు ప్రతిష్ట మంట గలుపుతున్నాయి. బీజేపీ-ఆర్ఎస్ఎస్ కూటమి సారథ్యంలోని మతతత్వ శక్తులు కేంద్రంలో అధికారం చేజిక్కించుకోవాలని ప్రయత్నిస్తూ మన గణతంత్రపు లౌకిక-ప్రజాస్వామిక విలువలకు ముప్పుగా పరిణమించాయి.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రగాఢ విశ్వాసం ఉంచి అందులో పాలుపంచుకుంటూ పార్లమెంటరీ వ్యవస్థను ఎల్లవేలలా పటిష్టపరుచుతూ వచ్చిన వారంతా ఇప్పుడు కూడా కార్యోన్ముఖులు కావాలి. తమ హక్కులను ఉద్ఘటించాలి. అవినీతి పాలన అంతమొందించడానికి, ప్రజాస్వామ్యాన్ని లౌకికవాదాన్ని బలోపేతం చేయడానికి అనువైన విధంగా విధానాలలో మార్పు తెచ్చేందుకు వారు పోరాడాలి.

## యూపీఏ ప్రభుత్వ పనితీరు నిరాశాజనకం

యూపీఏ ప్రభుత్వాలు రెండూ నయా ఉదారవాద ఆర్థిక విధానాలు అమలు చేశాయి. అవి దేశంలో ఆర్థిక అసమానత పెరిగేందుకు దారితీశాయి. ఈ విధానాల ఫలితమే ప్రభుత్వాలు ధనికులను నెత్తినబెట్టుకుని ప్రజలను పిప్పిచేశాయి.

## జనజీవనం మీద ప్రభావం

యూపీఏ ప్రభుత్వం తొలి సంవత్సరాల్లో సాధించామని చెప్పుకునే అధిక ఆర్థిక వృద్ధి రేటు వల్ల సామాన్యుల జీవితాలు ఏమీ మారలేదు. ఈ పాలనకు అద్దం పట్టే కొన్ని వాస్తవాలు:

36 శాతం మహిళలకు, 34 శాతం పురుషులకు చాలినంత ఆహారం లభించలేదు.

5 ఏళ్ల లోపు పిల్లల్లో దాదాపు సగం (48శాతం) మందికి చాలినంత ఆహారం గానీ, సమీకృత పోషకాహారం గానీ కరువైంది.

1వ తరగతి 5వ తరగతి మధ్యనే 29 శాతం మంది చిన్నారులు బడి మానుకున్నారు. 1వ తరగతి నుంచి 8వ తరగతి లోపు 46శాతం మంది పిల్లలు చదువుకు స్వస్తి చెప్పాల్సి వచ్చింది.

గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం, పట్టణాల్లో 64 శాతం కుటుంబాల ఆహారంలో వారికి అవసరమైన దానికంటే తక్కువగానే క్యాలరీలు (శక్తికి కొలమానం) ఉన్నాయి.

ప్రపంచంలో అత్యధికంగా వైద్యం ప్రయివేటీకరించబడిన దేశాల్లో ఇండియా ఒకటి. 80 శాతం మంది ఔట్‌పేషెంట్లు, 60 శాతం మంది ఇన్‌పేషెంట్లు ప్రయివేటు రంగంలోనే వైద్యసేవలు పొందారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో వైద్యం ఖర్చులు అసాధారణంగా ఉండటంతో ప్రతిఏటా ప్రతిఏటా ఎనిమిది కోట్ల మంది ప్రజలు దారిద్ర్య రేఖ దిగువకు జారిపోయారు.

## శ్రామికులు : నష్టపోయారు

నయా ఉదారవాద పాలనలో దోపిడీకి ప్రధాన లక్ష్యం శ్రామికులు. సంఘటిత పారిశ్రామిక రంగంలో జరిగిన నికర విలువ జోడింపులో వేతనాల వాటా ప్రపంచంలోనే కనిష్టంగా ఉంది. 1981లో ఈ వాటా 30.36శాతం కాగా,2007-08లో ఇది 10.6 శాతానికి క్షీణించింది.

వేతనాల వాటా తగ్గడానికి ప్రధాన కారణం కాంట్రాక్టు, క్యాజువల్ ప్రాతిపదికన కార్మికులను నియమించుకోడం. దీనివల్ల యాజమాన్యాలు తమ లాభాలు పెంచుకోగలిగాయి. 2004-05 నుంచి 2011-12 మధ్యకాలంలో పని దొరక్కపోవడంతో మహిళా శ్రామికుల సంఖ్య దాదాపు రెండు కోట్లు తగ్గింది.

కనీస వేతనాలు చెల్లించకపోవడం, సమాన వేతనాలు మాతృత్వ ప్రయోజనాలు నిరాకరించడం పరిశ్రమల్లో ప్రబలిపోయాయి. కార్మిక సంఘాల ఏర్పాటు హక్కు ప్రమాదంలో పడింది. మారుతీ సుజుకీ కేసు ఇందుకు గట్టి ఉదాహరణ. కాంగ్రెస్ బీజేపీ ప్రభుత్వాలు రెండూ కూడా రాష్ట్రాల్లో కార్మిక వర్గ వ్యతిరేక విధానాలే అమలు చేశాయి.

## దిక్కుతోచని రైతులు

ఎన్‌డీఏ ప్రభుత్వ విధానాలతో తొలిసారి, తర్వాత యూపీఏ ప్రభుత్వ విధానాలతో రైతాంగం కోలుకోలేని దెబ్బ తిన్నది. వ్యవసాయ రంగం కార్పొరేటీకరణ, సబ్సిడీలలో, వ్యవసాయ రంగ పెట్టుబడులలో కోతలు, వాణిజ్య సరళీకరణ విధానాలు పెద్ద సంఖ్యలో రైతులను క్షోభకు గురిచేశాయి. 1996-2012 మధ్య గ్రామీణ భారతదేశంలో దిగ్భ్రాంతికరంగా 2.9 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. భూసంస్కరణ చట్టాల రద్దు, వ్యవసాయ భూముల అక్రమ స్వాధీనం ఫలితంగా అనేక మంది రైతులు వ్యవసాయానికి దూరమయ్యారు. 1991-2011 మధ్య 5 కోట్ల మంది సాగుదారులు వ్యవసాయాన్ని వదిలిపెట్టారు. నయా ఉదారవాద విధానాలు అంతమొందిస్తే తప్ప, ఈ దేశ రైతాంగానికి గౌరవప్రదమైన జీవనం, భద్రమైన భవిత సమకూరవు.

## అత్యధిక దోపిడీకి గురైంది వ్యవసాయ కార్మికులు

వ్యవసాయ కార్మికుల పరిస్థితి క్రమంగా దిగజారిపోయింది. కూలీ రేట్ల నిర్ణయానికి, సామాజిక భద్రత ప్రయోజనాలు కల్పించడానికి ఒక సమగ్రమైన చట్టం తీసుకురావడానికి కేంద్రప్రభుత్వాలు నిరాకరించాయి. దాంతో చాలా రాష్ట్రాల్లో వ్యవసాయ కార్మికులకు చట్టబద్ధమైన స్థిరమైన కనీస వేతనాలు లేవు. ఏడాదికి పనిదినాలు కూడా తగ్గిపోయాయి. చాలా రాష్ట్రాల్లో వారికి ఇళ్ల స్థలాలు లేదా ఇళ్లు గానీ లేవు. వ్యవసాయ మహిళా కార్మికుల దురవస్థ మరింత దుర్భరస్థితి కింద మారింది. వారి పనిదినాల సంఖ్య మరింత తక్కువగా ఉంది. పెరిగిపోతున్న ధరల నేపథ్యంలో ఇల్లు గడవడానికి వారు పనిచేయడం తప్పనిసరి. కాబట్టి వారిపై భారం మరింత పెరిగి కష్టాల పాలయ్యారు.

## నడ్డివిరిచిన ధరలు

కాంగ్రెస్ పాలిత యూపీఏ ప్రభుత్వ వైఫల్యాలలో కొట్టొచ్చినట్లు కనిపించేది ఏమిటంటే ఆహారం ఇతర నిత్యావసర సరకుల ధరలు నిర్దయగా పెరిగిపోతుంటే వాటిని

అదుపు చేయలేని నూటికి నూరు పాళ్ల అసమర్ధత! 2007 నుంచి ఏడు సుదీర్ఘ సంవత్సరాలుగా నిరంతరం కొనసాగిన రెండంకెల ఆహార ద్రవ్యోల్బణంతో ఇండియా బతుకు వెళ్లదీసింది. వినియోగ ధరల సూచీ ప్రకారం వార్షిక ద్రవ్యోల్బణం చాలామట్టుకు 9 శాతం పైనే కొండెక్కికూర్చుంది.

2009 డిసెంబర్ నుంచి 2013 వరకు చివరి నాలుగేళ్లలో, బియ్యం గోధుమ వేరుశనగ నూనె ధరలు 50 నుంచి 100 శాతం పెరిగాయి; ఆలుగడ్డల ధర రెట్టింపైంది. అయిదేళ్లకు కలిపి చూస్తే, నాలుగు రెట్లు పెరిగింది; ఉల్లిగడ్డలు సగటున అప్పటికే గరిష్టంగా ఉన్న స్థాయి నుంచి రెండింతలయ్యాయి.

ధరల పెరుగుదల వాస్తవానికి ప్రభుత్వ విధానాల ఫలితమే. పెట్రోలు, డీజిలు ధరలపై నియంత్రణ ఎత్తేయడంతో వాటి ధరలు అదేపనిగా పెరిగాయి. ఆ ప్రభావంతో రవాణావ్యయం హెచ్చింది. దాంతో అన్ని ధరలూ భగ్గుమన్నాయి. డీజిలు ధరలు యూపీఏ1,2

ప్రభుత్వాల హయాంలో దాదాపు మూడింతలైంది. 2004 జనవరిలో రూ.20 ఉండగా 2013 డిసెంబరు నాటికి ఇది రూ. 55 (ఢిల్లీ ధరలు) కి ఎగబాకింది.

కర్కశంగా నిర్దయగా పెరిగిన ధరలు ప్రజల, ముఖ్యంగా పేదల నడ్డివిరిచాయి.

## నిరుద్యోగ శాపం

ధరల పెరుగుదలను అదుపు చేయలేకపోవడం ఒక్కటే కాదు, నిరుద్యోగం పెరిగిపోవడం యూపీఏ ప్రభుత్వ రెండో అతిపెద్ద వైఫల్యం. 2005-2010 మధ్య కాలంలో ఉపాధి కల్పన వృద్ధి రేటు ఏడాదికి 1 శాతం కూడా లేదు. ఆ సృష్టి అయిన ఉద్యోగాలు కూడా తక్కువ ఆదాయం ఉండేవి, కాంట్రాక్టు ఉద్యోగాలు, సామాజిక భద్రత లేనివి. 15-29 ఏళ్ల గ్రూపులోకి వచ్చే యువజనుల సంఖ్య 330 మిలియన్లు (33 కోట్లు) కాగా, వారిలో నిరుద్యోగం రేటు 13.3 శాతం. ఈ వయోవర్గంలోని ప్రతి ముగ్గురు గ్రాడ్యుయేట్లలో ఒకరు నిరుద్యోగిగా ఉన్నాడు.

అధిక వృద్ధి సాధించాయని చెప్పబడే సంవత్సరాలు చివరకు ఉద్యోగాల్లేని వృద్ధిని మిగిల్చాయి. ఇలాంటి దివాలాకోరు వృద్ధిబాటను తిరస్కరించాలి.

## ఆర్థిక విధానాలు : ధనికులకు వనరుల బదిలీ

కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యూపీఏ ప్రభుత్వం కార్పొరేట్లకు ధనిక వర్గాలకు మరింత సంపద సృష్టించిపెట్టింది. 2003లో 13 మంది ఉన్న బిలియనీర్లు (రూ. 5000 కోట్లు అంతకు మించిన నికర ఆస్తులు ఉన్న వారు) ఉండగా 2012 నాటికి అలాంటి బిలియనీర్లు 122 మంది ఉన్నారు. 2009-2013 మధ్య భారీ మొత్తంలో రూ. 21 లక్షల కోట్ల కేంద్ర ప్రభుత్వ పన్ను ఆదాయాలు పన్ను రాయితీల రూపంలోనూ, పన్నులు వదులుకోడం రూపంలోనూ వితరణ చేశారు. 2009 మరియు 2013 మధ్య ప్రభుత్వ రంగ సంస్థల్లో రూ. 91,000 కోట్ల విలువైన వాటాలను విక్రయించి భారీగా పెట్టుబడుల ఉపసంహరణకు పాల్పడింది. ఈ దేశ సహజ వనరులను అవి భూమి కానివ్వండి, ఖనిజాలు, గ్యాస్ లేదా స్పెక్ట్రమ్ కానివ్వండి లూటీ చేసుకోడానికి అనుమతించింది. బడా వ్యాపార కుటుంబాలు, ప్రయివేటు కంపెనీలు ఈ దోపిడి ద్వారా అసాధారణంగా గాలివాటు లాభాలు సంపాదించింది.

ఈ ప్రభుత్వం చేసిందల్లా దేశం యొక్క, దేశ ప్రజల యొక్క సహజ వనరులను కొద్ది మందికి స్వాధీనపరచడమే!

సంపన్నులకు వర్తించే పన్ను రేట్లు పెంచడం ద్వారా లేదా వారి పన్ను ఎగవేతలపై పెద్దపెట్టున విరుచుకు పడటం ద్వారా పన్ను ఆదాయం పెంచుకోడానికి వీలున్నప్పటికీ ప్రభుత్వం అలాంటి చర్యలు ఏవీ తీసుకోలేదు. 2007-08లో ఉన్న దాని కంటే టాక్స్-జీడీపీ నిష్పత్తి తక్కువగానే ఉండిపోయింది. ఆదాయాన్ని పెంచుకోడానికి బదులు, ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించి వేయడమే ప్రాధాన్యతగా మారింది. వ్యవసాయం, గ్రామీణ అభివృద్ధి (ఎంఎన్ఆర్ఇజిఏ సహా ); ఆరోగ్యం విద్య వంటి అంశాలు ప్రజాజీవితాలపై ప్రభావం కనబరిచేవి. ఈ వ్యయాలు సైతం కోతకు గురయ్యాయి. ఆహారం ఇంధనాల సబ్సిడీలలో గడచిన మూడేళ్లలో రూ. 78,000 కోట్ల మేరకు కోత ప్రభుత్వం కోత పెట్టింది.

అన్ని రంగాలలో 'విదేశీ పెట్టుబడి' ప్రవేశానికి అనుమతి లభించింది. బ్యాంకింగ్, మౌలిక వనరులు, రియల్ ఎస్టేట్, రక్షణ ఉత్పత్తులు, ఆగ్రి-బిజినెస్‌లలో ఎఫ్‌డీఐ (విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి) పరిమితులను పెంచారు. ఇండియాలో రిటైల్ వర్తకమే జీవనాధారంగా, ఉపాధిగా బతుకుతున్న 40 మిలియన్ల (4 కోట్ల) మంది ప్రయోజనాల కంటే వాల్‌మార్ట్,

ఇంకా ఇతర విదేశీ సూపర్‌మార్కెట్ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలు ఎలా ప్రాధాన్యతగా మారిపోయాయో చెప్పడానికి బహుళ ఉత్పత్తుల చిల్లర వ్యాపారంలోకి (మల్టీ బ్రాండ రిటైల్‌లోకి) ఎఫ్‌డీఐ అనుమతి అనేది చక్కటి ఉదాహరణ.

ఈ కార్యనిర్వాహక నిర్ణయాన్ని రద్దు చేయాలి. జాతీయ సర్వసత్తాక అధికారం, జాతీయ అభివృద్ధి, ప్రజల ఉపాధి అవసరాలు ఎఫ్‌డీఐ విధానానికి మార్గదర్శకాలుగా ఉండాలి.

ఆర్థిక మాంద్యం రావడంతో యూపీఏ ప్రభుత్వం విదేశీ పెట్టుబడిని ఆకర్షించేందుకు బడా వ్యాపార సంస్థలకు మరిన్ని పన్ను కోతలు, రాయితీలు ఇవ్వాలని భావిస్తోంది. వాస్తవంగా కావల్సింది గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, సామాజిక రంగాలలో భారీగా ప్రభుత్వ పెట్టుబడులు. కాని తన వర్గ పక్షపాతం దృష్ట్యా ప్రభుత్వం ఇలా చేయడానికి నిరాకరించింది.

బీజేపీ నేతృత్వంలోని ఆరేళ్ల ప్రభుత్వం, కాంగ్రెస్ నాయకత్వంలోని పదేళ్ల ప్రభుత్వం అనుసరించిన నయా ఉదారవాద విధానాలను ఆమూలాగ్రం మార్చివేయాలి.

## ఆహార భద్రత

గ్లోబల్ హంగర్ ఇండెక్స్ (అంతర్జాతీయ ఆకలి సూచీ)లోని 199 దేశాలలో భారత్ 94వ స్థానంలో ఉంది. దీర్ఘరోగంలా వెంటాడే ఆకలి, తినడానికి చాలినంత ఆహారం లేకపోవడం – ఒక దేశానికి ఈ రెంటిని మించిన అవమానం ఏముంటుంది? యూపీఏ ప్రభుత్వాలు, అంతకు ముందరి ఎన్‌డీఏ ప్రభుత్వం అనుసరించిన విధానాలపై చేస్తున్న నేరారోపణకు ఇవి రుజువులు. సర్వజనులకు వర్తించేలా సార్వత్రిక ప్రభుత్వ పంపిణీ వ్యవస్థను ప్రవేశపెట్టేందుకు ఈ రెండు పార్టీలూ గట్టిగా వ్యతిరేకించాయి. ఎందుకంటే ప్రపంచ బ్యాంకు , మార్కెట్ ఆర్థికవ్యవస్థ చేసే సూచనలకు ఇది విరుద్ధం అవుతుంది కాబట్టి. పార్లమెంటు ఆమోదించిన ఆహార భద్రత చట్టం ఆహార భద్రత దిశగా తీసుకున్న ఒక ప్రధానమైన చర్యగా చూపెడుతున్నారు. ఇది వాస్తవం కాదు. ఇది లక్షిత పీడీఎస్‌నే కొనసాగిస్తుంది. ఒక వ్యక్తికి నెల రోజులకు కేవలం 5 కిలోల ఆహార ధాన్యాలు మాత్రమే అందజేస్తుంది. పట్టణ ప్రాంతాల్లో 50 శాతం మంది జనాన్ని ఈ సదుపాయం నుంచి మినహాయించారు. సార్వత్రిక ప్రభుత్వ పంపిణీ వ్యవస్థను ప్రవేశపెట్టాలని సీపీఐ(ఎం),

లెఫ్ట్ అదేపనిగా పోరాడాయి. అన్ని కుటుంబాలకూ కనీసం 35 కిలోల ఆహార ధాన్యాలను కిలో రెండు రూపాయలకు మించని ధరకు అందించాల్సిన అవసరం ఉంది. ఆహారం పొందడం పౌరుల ప్రాథమిక హక్కు. దీనికి పూచీ ఉండాలి.

## అవినీతి, మెగా స్కాములు

యూపీఏ ప్రభుత్వపు గత దశాబ్ద పాలన అవినీతిలో మునుపెన్నడూ లేని అసాధారణమైన రికార్డు నెలకొల్పింది. 2జీ స్పెక్ట్రం నుంచి బొగ్గు క్షేత్రాల కేటాయింపుల వరకు, కృష్ణ గోదావరి బేసిన్ గ్యాస్ ధరల నిర్ణయం వరకు ఒక మెగా స్కాం తర్వాత మరోటి బయటపడుతూ వచ్చాయి. బడా వ్యాపార సంస్థలు- పాలక రాజకీయనాయకులు- ఉన్నతాధికారుల కుమ్మక్కు కావడానికి ప్రభుత్వ నయా ఉదారవాద విధానాలు దారి తీశాయి.

2జి టెలికాం స్పెక్ట్రం కేటాయింపులకు అనుసరించిన విధానాల వల్ల సీఏజీ (కాగ్) అంచనాల ప్రకారం ఖజానాకు రూ. 1.76 లక్షల కోట్లు, బొగ్గు స్కాంలో దాదాపు రూ. 1.86 కోట్లు నష్టం వాటిల్లింది. కేజీ బేసిన్ గ్యాస్ ఒప్పందం, రిలయన్స్‌కు అంతకు ముందు ఇచ్చిన రాయితీలు ప్రభుత్వానికి రూ. 1,00,000 కోట్ల నష్టం వాటిల్లేందుకు దారి తీశాయి. ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రస్తుత సవరణ వల్ల ఇది అంతకు రెట్టింపు అవుతుంది. ఇక కామన్‌వెల్త్ గేమ్స్ (సీడబ్ల్యూజీ) స్కాం విలువ రూ. 60,000 కోట్లు.

ప్రయివేటీకరణ, స్వేచ్ఛావిపణులు అవినీతిని తగ్గిస్తాయన్న వాదనలోని డొల్లతనం బయటపడింది. అవినీతి ఫలితమైన " నల్ల ఆర్థిక వ్యవస్థ" ఇలాంటి విధానాల అమలు వల్ల మరింతగా విస్తరించిందని రుజువులు వెల్లడిస్తున్నాయి. స్థూల జాతీయ ఉత్పత్తి (జీడీపీ)లో ఇప్పుడిది దాదాపు 50 శాతం ఉంటుందని అంచనా (ప్రపంచ ద్రవ్య వ్యవహారాల నైతికత సూచీ,2010 -గ్లోబల్ ఫైనాన్షియల్ ఇంటెగ్రిటీ ఇండెక్స్, 2010).

ప్రజలకు చెందిన వనరులు రకరకాల అవినీతి పద్ధతుల ద్వారా దోచుకోబడుతున్నాయి. పన్నులు ఉండని దేశాలకు, విదేశీ అక్రమ నిధుల తరలిపోయే సొమ్ము కూడా నల్లధనంతో పాటు భారీగా పెరిగింది; సంస్కరణల అనంతరం ఇలా తరలిపోయిన నిధులు అంతకు ముందరి వాటి కంటే అయిదు రెట్లు అధికం. విదేశాల్లో భారతీయుల పోగుపడ్డ పెట్టుబడులు, ఆస్తుల మొత్తం విలువ 0.5 ట్రిలియన్ (ట్రిలియన్ అంటే లక్ష కోట్లు) డాలర్ల నుంచి 1.4 ట్రిలియన్ డాలర్ల వరకు రూపాయల్లో చెప్పాలంటే రూ. 25 లక్షల కోట్ల నుంచి రూ. 70 లక్షల కోట్ల వరకు ఉంటుందని ఒక అంచనా.

అవినీతిపై ప్రజల్లో పెల్లుబికిన ఆగ్రహం, వెల్లువెత్తిన నిరసనలకు ఎట్టకేలకు తలవొగ్గిన యూపీఏ ప్రభుత్వం సవరించిన లోక్‌పాల్ బిల్లును తెచ్చింది, దీన్ని పార్లమెంటు ఆమోదించింది. ఏమైనప్పటికీ, లోక్‌పాల్ చట్టం తన పరిధిలోకి ప్రభుత్వ నిధుల ప్రమేయం ఉండే పీపీపీ (ప్రయివేట్ పబ్లిక్ పార్టిసిపేషన్ ) ప్రాజెక్టులు, కార్పొరేట్లకు ఇచ్చే కాంట్రాక్టులు ఈ చట్టం పరిధిలో ఉండితీరాలి. అంతకంటే ముఖ్యంగా, నయా ఉదారవాద విధానాలు సృష్టి చేసిన బడావ్యాపారి-రాజకీయనాయకుడు-బ్యూరోక్రాట్‌ల త్రయాన్ని వారి మధ్య సంబంధాన్ని విచ్ఛిన్నం చేయాల్సిన అవసరం ఉంది. ఇలాంటి కుమ్మక్కుకు దారితీసిన నయా ఉదారవాద విధానాలను సంపూర్ణంగా రద్దు చేయాలని సీపీఐ(ఎం) పిలుపు ఇస్తోంది.

## విదేశీ విధానం : అమెరికా వైపు మొగ్గు

దశాబ్ద కాలపు యూపీఏ ప్రభుత్వం భారత విదేశీ విధానం అమెరికా అనుకూల దృక్పథం తీసుకుంది. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా తో వ్యూహాత్మక మైత్రి , సైనిక సహకారం, భారత్-అమెరికా అణు ఒప్పందం.. వీటితో మొదటి అయిదేళ్లలోనే యూపీఏ భారత విదేశాంగ విధాన స్వతంత్రతను ఆ దేశానికి ధారదత్తం చేసింది. దాని విపరిణామాలే రెండో దఫా అయిదేళ్లలో పాలనలో ప్రస్ఫుటమయ్యాయి.

ఇరాన్‌తో సంబంధాలను తగ్గించుకుని ఇండియా తన స్వంత ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించింది. ఇరాన్-పాకిస్తాన్-ఇండియా గ్యాస్ పైప్‌లైన్‌ను అమెరికా ఆజ్ఞతో హడావుడిగా రద్దు చేసుకుంది. అమెరికా అక్రమ ఆంక్షలకు అనుకూలంగా ఇరాన్ నుంచి చమురు దిగుమతులను గణనీయంగా తగ్గించుకుంది. సిరియాపై సందిగ్ధ వైఖరి అవలంబించింది. అంతర్యుద్ధం ద్వారా సిరియా ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు పశ్చిమ దేశాల మద్దతుతో ప్రయత్నిస్తున్న శక్తులను ఖండించేందుకు నిరాకరించింది. ఇజ్రాయెల్‌తో సైనిక, భద్రత పరమైన బంధాన్ని బలోపేతం చేసుకుంది. దీనికి అనుగుణంగా పాలస్తీనా సమస్యకు మద్దతు తగ్గించివేసింది. ఇండియా-జపాన్-యూఎస్ త్రైపాక్షిక భద్రతా సంబంధాల మైత్రిలో భాగమైంది. చైనాను ఎదుర్కోడానికి అమెరికా చొరవతో రూపు దిద్దుకున్న ఏర్పాటు ఇది.

సౌత్-సౌత్ (వర్ధమాన దేశాలు) సహకారాన్ని , భిన్న ధృవత్వాన్ని పటిష్టం చేసేందుకు బ్రిక్స్ (బి ఆర్ ఐ సి ఎస్- బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా), ఇబ్సా (ఇండియా, బ్రెజిల్, సౌత్ ఆఫ్రికా), ఇతర బహుళ పక్ష వేదికలపై తన పలుకుబడిని ఇండియా ఉపయోగించలేదు.

దేశ జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఉండేలా ఒక స్వతంత్ర విదేశాంగ విధానానికి రూపకల్పన చేసేందుకు అనువుగా కాంగ్రెస్, బీజేపీల రెంటి విదేశాంగ విధాన వైఖరిని తిరస్కరించాలి.

## కాంగ్రెస్ : సిగ్గుచేటు రికార్డు

కాంగ్రెస్ ప్రభుత్వం వరుసగా పదేళ్లు పాలించి ఒక అత్యంత అవమానకరమైన రికార్డును నమోదు చేసుకుంది. అధికారం చెలాయించిన వారిలో అవినీతిని పెంచిపోషించింది; ధరల పెరుగుదలను, అధిక ద్రవ్యోల్బణాన్ని నిరంతరీకరించిన విధానాలు అనుసరించింది; గౌరవప్రదమైన జీవనాధారం కరువైన లక్షలాది మంది రైతులను పట్టించుకోలేదు; మతతత్వ శక్తులను అణిచేసేందుకు అవసరమైన కఠిన చర్యలు తీసుకోడంలో విఫలమైంది; యూఎస్‌తో చేతులు కలిపి దేశ సార్వభౌమాధికారంలో రాజీ పడింది.. ఈ విధానాలు, వైఫల్యాలతో ప్రజలు తనమీద ఉంచిన విశ్వాసాన్ని కాంగ్రెస్ వమ్ము చేసింది. వారికి నమ్మక ద్రోహం చేసింది.

యూపీఏను, దానికి సారథ్యం వహించిన కాంగ్రెస్‌ను ఈ అక్రమాలకు బాధ్యులుగా చేసి నిలదీయాలి, కాంగ్రెస్‌ను గద్దె దింపాలి.

## మతతత్వంపై పోరాటం

గత ఐదేళ్లుగా మతతత్వ ఉద్రిక్తతలు రెచ్చగొట్టడంలో అనేక మతతత్వ శక్తులు చురుగ్గా ఉన్నాయి. హిందువులు ముస్లిములు నడుమ విరోధాలు సృష్టించడం వాటిని తీవ్రం చేయడం హిందుత్వ సంస్థల ధ్యేయం. 2009 తర్వాత హైదరాబాద్, నాందేడ్, అహ్మదాబాద్, బెల్గాం, ధూలే, బోడోల్యాండ్ ప్రాంతం, కిష్త్వార్, నవద, బరేలి, కోసి కలన్, ప్రతాప్‌గఢ్, ఫైజాబాద్, ముజఫర్‌నగర్‌లలో మత కలహాలు చోటు చేసుకున్నాయి. ఇంకా చెప్పాలంటే, ఈ జాబితా అనంతం. రాజస్థాన్‌లో, 2008లో బీజేపీ అధికారం కోల్పోయిన తర్వాత, అనంతర సంవత్సరాలలో వరుసగా మత ఘర్షణలు జరిగాయి. ఉత్తర ప్రదేశ్‌లో, సమాజ్‌వాది పార్టీ ప్రభుత్వం 2011లో అధికారంలోకి వచ్చిన తర్వాత, ఎన్నో ఘర్షణలు ఉత్పన్నమయ్యాయి. ముజఫర్‌నగర్ హింసాకాండ ఇటీవలి సంవత్సరాల్లో ఘోరమైందని చెప్పాలి. వీటిలో చాలా ఘర్షణల్లో ఒక పద్ధతి ప్రకారం ఆర్ఎస్ఎస్, దాని సంస్థల ప్రమేయం కనబడుతోంది.

మధ్యప్రదేశ్; కర్నాటకల్లో బీజేపీ ప్రభుత్వాల పాలనలో మైనారిటీ మతస్తులైన ముస్లిములు, క్రైస్తవులు ఉభయుల మీదా దాడులు సంఖ్య, తీవ్రత పెరిగాయి.

2013 సంవత్సరంలో దేశవ్యాప్తంగా 828 మతపరమైన సంఘటనలు చోటు చేసుకోగా వాటిలో 133 మంది ప్రజలు చనిపోయారు. 2,269 మంది గాయపడ్డారు. సత్యం కటువుగా ఉంటుంది. అయినా అది విస్మరించరానిది- 16వ లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం ప్రజలను మతపరంగా నూటికి నూరు పాళ్లు విభజించేందుకే ఇలాంటి ఘర్షణలను తయారు చేశారు. ఇవి లౌకిక ప్రజాస్వామిక శక్తులకు ఇవొక హెచ్చరిక. దృఢ రాజకీయ సంకల్పంతో పట్టుదలతో మత రాజకీయాలను గట్టిగా ప్రతిఘటించాలి. అప్పుడు మాత్రమే మత సామరస్యం, ప్రజల మధ్య ఐక్యత, ప్రగతి సాధ్యమవుతాయి.

## ఉగ్రవాదం

ఉగ్రవాద దాడులు దేశం విభిన్న ప్రాంతాల్లో జరుగుతూనే ఉన్నాయి. ఉగ్రవాదానికి మూలం అనేక రకాలుగా ఉన్న మత సంబంధ అతివాదమే. ముస్లిం సమాజంలోని కొన్ని తీవ్రవాద శక్తుల హస్తం ఉన్న ఉగ్రవాద హింసాకాండ సంఘటనలు అలాగే కొనసాగుతున్నప్పటికీ.. మాలెగామ్, మక్కా మసీదు, అజ్మీర్ షరీఫ్, సంఝోతా ఎక్స్‌ప్రెస్‌లలో జరిగిన ఉగ్రవాద పేలుళ్ల వెనుక మాత్రం హిందుత్వ అతివాద శక్తులు ఉన్నాయి. ఈశాన్యాన తీవ్రవాద హింసాకాండలో దురహంకార గ్రూపుల ప్రమేయం ఉంది.

ఉగ్రవాద ముఠాలు పుట్టుకురావడానికి మత సంబంధ అతివాదం, మతతత్వం, జాత్యభిమాన శక్తులు కారణమవుతున్నాయి. వీటిపై కలసికట్టుగా ఉద్యమించాల్సి ఉంది. ఉగ్రవాద దాఢులను నిరోధించాలన్నా, ఉగ్రవాదుల నెట్‌వర్క్‌లను పసిగట్టాలన్నా గట్టి చర్యలు తీసుకోవడం అవసరం. అయితే ఉగ్రవాదం అదుపు పేరిట అమాయక ముస్లిం యువతను లక్ష్యంగా చేసుకోడం, వివక్ష ప్రదర్శించడం ఆపితీరాలి. తప్పుడు కేసుల్లో యువకులను ఇరికించే భద్రతాదళాలపై, పోలీసు అధికారులపై చర్య తీసుకుని తీరాలి. ఇలాంటి యువకులు దీర్ఘకాలం జైళ్లలో మగ్గి కోర్టు తీర్పులతో విడుదలైనప్పుడు రాజ్యం వారికి పరిహారం చెల్లించాలి. చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టంలోని నిరంకుశ నిబంధనలను తొలగించాలి.

## విచ్ఛిన్న శక్తుల అణచివేత

ప్రాంతీయ దురహంకార శక్తులు, సంకుచిత ప్రయోజనాల పరమైన, జాతి కుల సంబంధమైన ఉద్రిక్తతలు దేశం విభిన్న ప్రాంతాల్లో తలెత్తాయి. ఉత్తర భారతీయులపై ముంబాయి, మహారాష్ట్రల్లో ఎంఎన్ఎస్, శివసేనల దాడులు; బయటి వారు రాష్ట్రం వదిలి వెళ్లాలన్న డిమాండ్ అనేక మంది భారత పౌరుల జీవితాలను ప్రభావితం చేసింది. ఈశాన్య ప్రాంత ప్రజలకు విద్వేషపూరితమైన మెయిల్స్ (హేట్ మెయిల్స్) , బెదిరింపుల ఫలితంగా దక్షిణాదిన కొన్ని చోట్ల నుంచి వారు తమ ప్రాంతానికి పారిపోవలసి వచ్చింది. ఇటీవలే దేశరాజధాని ఢిల్లీలో ఈశాన్య భారతీయులపై జాతివివక్ష దాడులు జరిగాయి. మరోవంక ఈశాన్యంలో అతివాదులు హిందీ మాట్లాడే కార్మికులను లక్ష్యంగా చేసుకుని చంపేశారు. ఈ విచ్ఛిన్నకర, ప్రతీఘాత దాడులను కఠినంగా అణచివేయాలి. ఇలాంటి దాడుల వెనుక ఉన్న సంస్థలను నాయకులను శిక్షించితీరాలి. భారతదేశంలోని ఏ ప్రాంతంలోనైనా సరే జీవించడానికి, విద్యనభ్యసించడానికి లేదా పని చేసుకోడానికి భారత పౌరులకు ఉన్న హక్కును గట్టిగా పరిరక్షించాలి.

## మహిళలపై హింసాకాండ

గత లోక్‌సభ ఎన్నికల తర్వాత గడచిన కాలం మహిళలపై నేరాలు వెనుకంజ లేకుండా ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. ఇది ఒక ప్రధానమైన జాతీయ సమస్యగా మారింది. మహిళలపై, చిన్న వయస్సు అమ్మాయిలపై అత్యాచారాలు, సామూహిక అత్యాచారాలు దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్నాయి. యువతులపై, చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులు, హింసాకాండ మరీ భయానకం. ఢిల్లీలో నిర్భయ కేసు తర్వాత ఏర్పాటు చేసిన జస్టిస్ జె ఎస్ వర్మ కమిటీ సవివరమైన నివేదిక సమర్పించింది. మహిళలపై హింసాకాండకు సంబంధించిన చట్టాలలో తీసుకురావలసిన సిఫారసులపై ఈ నివేదిక చక్కటి సిఫారసులు చేసింది. ఫలితంగా పార్లమెంటు క్రిమినల్ లా సవరణ చట్టం చేసింది. సామూహిక అత్యాచారం, చిన్నారులపై అత్యాచారం, ఇతర లైంగిక నేరాలకు కఠిన శిక్షలు ఇందులో చేర్చారు. అయితే వర్మ కమిటీ చేసిన సిసలైన సిఫారసులు ఇందులో చేర్చలేదు.

మహిళలపై జరుగుతున్న హింసను తుదముట్టించడానికి జరిపే పోరాటం అటు రాజకీయ ఇటు సామాజిక రంగాలలో కేంద్ర స్థానం వహించాలి. చట్టాలు చేస్తే చాలదు.

మహిళలపై నేరాలను కఠినంగా అణచివేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైపు నుంచి రాజకీయ చిత్తశుద్ధి ఉండాలి. పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రంలో గడచిన మూడేళ్లలో నేరాల సంఖ్య ఆందోళనకరంగా పెరగటం దిగ్భ్రాంతి కలిగిస్తుంది. గట్టి పట్టుదలతో సమస్యపై పోరాడాలంటే, సంబంధిత రాష్ట్ర యంత్రాంగం కూడా ఎంత ముఖ్య పాత్ర వహించాలో ఇది సూచిస్తోంది.

## ఎస్సీలు ఎస్టీలు

సామాజిక అణచివేతను, కుల వివక్షను , ఆదివాసీలపై దళితులపై హింసాకాండను నయా ఉదారవాద విధానాలు తీవ్రం చేశాయి. 2010- 2012 మధ్య దళితులపై హింసాకాండ కేసులు 18 శాతం పెరిగాయి. అంటరానితనం ఆచారాలు ఇంకా కొనసాగుతున్నాయి. పోస్టుల రద్దు, నియామకాలపై నిషేధం, చాలా సేవల ప్రయివేటీకరణ కారణాల వల్ల ప్రభుత్వంలో, ప్రభుత్వ రంగంలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ ఉద్యోగాల సంఖ్య తగ్గిపోయింది. అయితే అదే సమయంలో ప్రయివేటు రంగంలో రిజర్వేషన్‌లు ప్రవేశపెట్టడంలో ప్రభుత్వం విఫలమైంది. సహజ వనరుల దోపిడీ, నివాసిత భూముల స్వాధీనం, అయిదో అధికరణంలో పిఇఎస్ఏ (పెసా) చట్టంలో పొందుపరచిన రక్షణల ఉల్లంఘనలు... వీటన్నిటి వల్ల ఆదివాసీల జీవితాలపై, జీవనాధారాలపై తీవ్ర ప్రభావం పడుతోంది.

## మైనారిటీలు

సచార్ కమిషన్ సిఫారసుల మొక్కుబడి అమలు వల్ల ప్రయోజనం సిద్ధించలేదు. ప్రధాన రంగాలలో ముస్లిముల పట్ల వివక్ష అలాగే కొనసాగుతూనే ఉంది. ఉద్యోగాలలో ముస్లిములకు 10 శాతం రిజర్వేషన్‌కు సంబంధించి రంగనాథ్ మిశ్రా కమిషన్ సిఫారసులను ప్రభుత్వం నీరు గార్చి వేసింది. దీనికి తోడు అమాయక ముస్లిం యువకులను టార్గెట్ చేయడం, వారిని అండర్ ట్రయల్స్‌గా సంవత్సరాల తరబడి జైళ్లలో పెట్టడం చేస్తోంది. దీంతో ఈ వర్గంలో విస్తృత స్థాయిలో అభద్రత భావం ప్రబలింది.

## బీజేపీ : ఒక తిరోగమన విచ్ఛిన్న శక్తి

భారతీయ జనతా పార్టీ కాంగ్రెస్‌కు ఎలాంటి ప్రత్యామ్నాయం చూపించడం లేదు. వాస్తవానికి నయా ఉదారవాద విధానాలకు ఆ పార్టీ వీర అనుయాయి. ఆర్థిక విధానాలకు

సంబంధించినంత వరకు బీజేపీ దృక్పథంలో కూడా ఎలాంటి తేడా లేదు. అది హిందుత్వ భావజాలం మీద ఆధారపడిన, బడా వ్యాపారులకు అనుకూలమైన మితవాద పార్టీ.

బీజేపీ, దాని మాతృక అయిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌లు బయటపెట్టే భావజాలం ఆధునిక లౌకిక రాజ్య స్వప్నానికి బద్ధవిరుద్ధం. హిందూ 'అధిక సంఖ్యాక ప్రాతిపదిక' (మెజారిటేరియన్ ప్లాట్‌ఫాం) దాని మతతత్వ రాజకీయాలకు మతతత్వ హింసాకాండకు ప్రధాన వనరు. అల్పసంఖ్యాక మతతత్వానికి ఊపిరి పోస్తున్నది, ప్రజల ఐక్యతకు ముప్పుగా మారినది ఈ అధికసంఖ్యాక మతతత్వ వాదమే.

ప్రధాన మంత్రి అభ్యర్థిగా ప్రకటించిన నరేంద్ర మోడీ, బీజేపీ అదేపనిగా ఊదరగొడుతున్న 'గుజరాత్ మోడల్' పాలన ఒక భయానక వాస్తవాన్ని బయట పెడుతున్నాయి. బడావ్యాపారానికి, కార్పొరేట్లకు ప్రాపకం కల్పించడం, అదే సమయంలో ఉగ్రమతతత్వం ప్రదర్శించడం అనేది ప్రమాదకరమైన కలయిక. దీనికి ప్రాతినిధ్యం వహించేది మోడీ, ఆయన గుజరాత్ మోడల్.

కార్పొరేట్లకు వితరణ మీద ఆధారపడినటువంటిది ఈ గుజరాత్ మోడల్. కార్మికులకు అతి తక్కువ వేతనాలు, పోషణలేమి ఎక్కువగా ఉండటం, మాతాశిశు మరణాల రేటు ఎక్కువగా ఉండటం వంటి ఘోరమైన సామాజిక సంక్షేమ సూచీలు ఈ మోడల్‌కు విశిష్టతను చాటిచెబుతాయి.

బీజేపీ ఉన్నతస్థాయి అవినీతితో కుళ్లిపోయింది. ఎన్‌డిఏ హయాం నాటి టెలికాం, బొగ్గు క్షేత్రాల కేటాయింపుల్లోనే అనేక మెగా స్కాముల మూలాలు ఉన్నాయి. కర్నాటకలో యడ్యూరప్ప నాయకత్వంలో ఘోరంగా అపఖ్యాతి పాలైన బీజేపీ ప్రభుత్వమే ఆ ప్రభుత్వంలోనే భాగమైన మైనింగ్ మాఫియాతో కలిసి బ్రహ్మాండమైన గనుల కుంభకోణానికి పాల్పడింది. మధ్యప్రదేశ్ బీజేపీ ప్రభుత్వంలో మంత్రి తర్వాత మంత్రి లోకాయుక్త విచారణలో అవినీతిపరులుగా గుర్తించబడ్డారు. సహజవనరుల ప్రయివేటీకరణ, దోపిడీలను అనుమతించడంలో బీజేపీ రికార్డు కాంగ్రెస్‌కు ఏ మాత్రం తీసిపోదు.

మతతత్వ రాజకీయాలతో ఉన్మాదపు దాడులకు తెగబడిన సిగ్గుచేటు వారసత్వం బీజేపీ సొంతం. 1992 నాటి బాబ్రీ మసీదు కూల్చివేత, 2002 నాటి గుజరాత్ బీభత్స మారణకాండ, ఇటీవలి ముజఫర్‌నగర్ అల్లర్లు ఆ పార్టీ చీకటి చరిత్రకు సాక్ష్యాలు.

**హిందుత్వ భావజాలం** వాస్తవానికి వర్ణాశ్రమ ధర్మం మీద ఆధారపడి రూపొందింది. సామాజికంగా అది మార్పును అంగీకరించని సాంప్రదాయిక, తిరోగామి తత్వం. కాబట్టే,

బీజేపీ పాలన ఉన్న లేదా ఆ పార్టీ బలంగా ఉన్న మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో షెడ్యూల్డ్ కులాలు, తెగల మీద అత్యధికంగా దుర్మార్గాలకు పాల్పడటం యాదృచ్ఛికం కాదు.

బీజేపీ ఎంతగా తన మోడల్ అభివృద్ధిని, సుపరిపాలనను గురించి చెప్పుకున్నప్పటికీ, అదొక ప్రతీఘాత, తిరోగామి నమూనా అన్నది వాస్తవం.

## వామపక్షాల ప్రత్యామ్నాయ విధానాలు

కాంగ్రెస్ బీజేపీల రాజకీయాల నుంచి వాటి విధానాల నుంచి దేశాన్ని కాపాడాలి. ఆర్థిక సామాజిక, రాజకీయ రంగాలలో ప్రత్యామ్నాయ విధానాలు. సీపీఐ(ఎం), ఇతర వామపక్షాలు అలాంటి ప్రత్యామ్నాయాన్ని రూపొందించాయి. ఈ ప్రత్యామ్నాయ విధానాలు ఈ దిగువ పేర్కొన్న ప్రధాన అంశాలు కలిగి ఉంటాయి:

(1) లౌకికవాదం, జాతీయ సమైక్యతల రక్షణ (2) వ్యవసాయ సంబంధాల ప్రజాస్వామిక పరివర్తనం,భూసంస్కరణలు; రైతులకు గిట్టుబాటు ధరలు (3) ఉత్పాదక శక్తులను అభివృద్ధి చేసే, ఉపాధిని గరిష్టీకరించే, ఆర్థిక సామాజిక అసమానతలను తగ్గించే స్వయంసమృద్ధ ఆర్థిక వ్యవస్థ మరియు అభివృద్ధి పథం (4) అవసరమైన రాజ్యాంగపరమైన మార్పులతో ప్రజాస్వామిక మరియు సమాఖ్య రాజకీయ వ్యవస్థ (5) శ్రామికుల హక్కులు, వారి కనీస జీవనాధారం, సామాజిక భద్రతల రక్షణ (6)ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి, సంతులిత వృద్ధి(7)సామాజిక న్యాయం, కుల వివక్ష నిర్మూలన, మహిళల దళితుల అల్పసంఖ్యాకుల ఆదివాసీల హక్కుల పరిరక్షణ (8) అవినీతి నిర్మూలనకు గట్టి చర్యలు; న్యాయవ్యవస్థ, ఎన్నికల సంస్కరణలు (9) అలీన, స్వతంత్ర విదేశాంగ విధాన అవలంబన.

ఈ ప్రత్యామ్నాయ విధానాలు ఈ ఎన్నికల ప్రణాళిక రెండో భాగంలో వివరించబడ్డాయి.

లెఫ్ట్ నేతృత్వంలోని ప్రభుత్వాలు కేరళలో అనేక సార్లు, పశ్చిమ బెంగాల్‌లో 34 సంవత్సరాలు, త్రిపురలో ఏడు లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వాలు వాటి స్థాయిలో అవి అమలు చేయగలిగిన ఈ ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేసి చూపించాయి. భూసంస్కరణలు సమర్థంగా అమలు చేయడం; పంచాయతీ వ్యవస్థకు అధికారాల వికేంద్రీకరణ; ప్రభుత్వ పంపిణీ వ్యవస్థను ఎక్కువ మందికి విస్తరింపజేయడం; రైతులు, కార్మికుల జీవనాధారాన్ని కాపాడటం; మతసామరస్యాన్ని, లౌకికవాదాన్ని నిలబెట్టడం.

## సిపిఐ(ఎం) పాత్ర

నయా ఉదారవాద ఆర్థిక విధానాలపై, మతతత్వంపై, పాలక వర్గ పార్టీల సామ్రాజ్యవాద అనుకూల వైఖరిపై సీపీఐ(ఎం) నిరంతర పోరాటం సాగించింది.

దేశంలోని శ్రామిక జనుల పక్షాన దృఢంగా నిలిచింది. శ్రామిక వర్గం, రైతాంగం, వ్యవసాయ కార్మికులు, చేతివృత్తుల వారు, సంఘటిత, అసంఘటిత రంగాలు రెంటిలో ఉన్న ఉద్యోగుల హక్కుల కోసం పోరాడింది.

దళితులు, ఆదివాసీలు, మహిళలు, అల్పసంఖ్యాక వర్గాలు, వెనుకబడిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ప్రజాస్వామికంగా వారి పక్షం వహించింది.

కాంగ్రెస్, బీజేపీలకు వ్యతిరేకంగా ప్రజల ముందు ఒక ప్రత్యామ్నాయం ఉంచేందుకు సిపిఐ(ఎం), లెఫ్ట్ పార్టీలు లౌకిక కాంగ్రేసేతర పార్టీలతో సహకరించి పనిచేస్తాయి.

కాంగ్రెస్‌ను, యూపీఏను తిరస్కరించాల్సిందిగా మేం ప్రజలకు విన్నపం చేస్తున్నాం.

బీజేపీని దాని మిత్ర పక్షాలను ఓడించండి, వాటిని అధికారంలోకి రాకుండా నిరోధించండి.

## ప్రత్యామ్నాయం కోసం...

## సిపిఐ(ఎం), వామపక్షాలను బలపరచండి

సిపిఐ(ఎం)కు ఓటేసి మద్దతు ఇవ్వవలసిందిగా ప్రజలకు మేం అప్పీలు చేస్తున్నాము. లౌకిక-ప్రజాస్వామిక పునాదులను గట్టిపరిచేందుకు, ప్రజానుకూల ప్రత్యామ్నాయ విధానాలకు లోకసభలో బలమైన సిపిఐ(ఎం) మరియు వామపక్షాల ఉనికి ఒక ప్రాతిపదిక అవుతుంది.

**లౌకిక, ప్రజాస్వామిక ప్రత్యామ్నాయం కోసం**

**కాంగ్రెస్ తిరస్కరించండి, బీజేపీని ఓడించండి**

**సిపిఐ(ఎం)కు ఓటేయండి**

**వామపక్షాలను బలపరచండి**

# ద్వితీయ భాగం

## ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాల కోసం

### ప్రత్యామ్నాయ అభివృద్ధి మార్గం

**సిపిఐ(ఎం) దిగువ ఆర్థిక విధానాల కొరకు కృషి చేస్తుంది.**

- డిమాండ్ పెరిగేందుకు అనువుగా జనానికి పూర్తి ఉపాధి కల్పించటం మరియు వారి చేతుల్లోకి డబ్బు చేరేందుకు పూర్తి ఉపాధితో కూడిన సంపూర్ణ అభివృద్ధి.
- ధనికుల, కార్పొరేట్‌ల లాభాలపై పన్నుల ద్వారా వనరులను విస్తృత పరచటం, నల్లధనం, అక్రమ సంపాదన పరులు, పన్ను ఎగవేతదార్లపై దాడులు, విలాస వస్తువులపై అధిక పన్నుల ద్వారా అభివృద్ధికి వనరులను సమకూర్చుకోవటం.
- వ్యవసాయ ఉత్పత్తి మరియు పరిశోధనలో ప్రభుత్వ పెట్టుబడులను పెంచటం.
- భౌతిక మరియు సామాజిక మౌలిక సౌకర్యాలకు వనరులను కేటాయించటం-అంటే విద్యుత్, ప్రజా రవాణా, రేవులు, పాఠశాలలు, కాలేజీలు మరియు ప్రభుత్వ ఆసుపత్రులు.
- భరించలేని విలాస వస్తువులకు తప్ప ప్రజా వినియోగానికి ఉపయోగపడే వస్తూత్పత్తికి అనుకూలత.
- పౌరులకు వస్తువులను సమకూర్చటం మరియు పెట్టుబడికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, విద్యుత్,డీజిల్‌లను సబ్సిడీలతో ప్రభుత్వం అందించడం.
- ఎక్కువ ఉపాధికి అవకాశం కల్పించే చిన్న మధ్య తరగతి సంస్థల పోటీతత్వాన్ని పెంచేందుకు అవసరమైన ప్రత్యేక చొరవలు మరియు పరిశోధన, అభివృద్ధికి ప్రోత్సాహకాలను అందించటం.
- ప్రస్తుత భారత జిడిపిలో పదిశాతానికి వార్షిక ప్రణాళికా ఖర్చు పెంచటం.
- ద్రవ్య బాధ్యత మరియు బడ్జెట్ యాజమాన్య చట్ట రద్దు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు

సామాజిక ఖర్చుకోసం తప్పనిసరిగా కేటాయించాల్సిన కనీస మొత్తాలను నిర్దేశించాలి.

- ద్రవ్య పెట్టుబడి రాకపోకలపై కంట్రోళ్లను మళ్లీ విధించటం
- ప్రభుత్వ రంగ బ్యాంకుల, బీమా సంస్థలలో ప్రభుత్వవాటా తగ్గింపును ఇంతటితో నిలిపివేయటం మరియు ప్రాధాన్యతా రంగానికి రుణాలు ఇచ్చేందుకు గట్టిగా కట్టుబడి ఉండటం.
- ద్రవ్య రంగంలోని అన్ని క్రమబద్ధీకరణ అధారిటీలు పార్లమెంట్‌కు జవాబుదారీగా ఉండటం మరియు చట్టసభ పర్యవేక్షణకు లోబడి ఉండటం.

## వనరులు సమీకరణ

దీర్ఘకాలిక కాపిటల్ గెయిన్స్ పన్నును పునరుద్ధరించటం ద్వారా స్పెక్యులేటివ్ కాపిటల్ గెయిన్స్‌పై పన్నులు వేయటం మరియు సెక్యూరిటీల లావాదేవీల పన్ను విధింపు.

- నల్ల ధనం, ప్రత్యేకించి స్విస్ బ్యాంకులు మరియు ఇతర పన్ను స్వర్గాలలో దాచుకున్న సొమ్ము వెలికి తీతకు చర్యలు
- అత్యంత ధనికులపై సంపద పన్ను పెంచటం మరియు వారసత్వ సంపద పన్ను ప్రవేశపెట్టటం
- మారిషస్ ఇతర దేశాలతో కుదుర్చుకున్న ద్వంద్వ పన్నుల నివారణ ఒప్పందాలను సమీక్షించటం ద్వారా మారిషస్ దారుల మూసివేత.
- ఆదాయానికి గండి పడే విధంగా తగ్గించటం కాకుండా సమర్ధవంతంగా చట్టబద్ధమైన పన్నుల రేట్లను పెంచటం ద్వారా కార్పొరేట్ లాభాల పన్నును పెంచాలి.
- భారత్‌లో ఉన్న ఆస్థులతో సంబంధం ఉన్న విదేశీ కంపెనీల వాటాలను అంతర్జాతీయ బదిలీ చేసిన సందర్భాలలో కాపిటల్‌గెయిన్ పన్నుల విధింపు.
- ప్రస్తుత ద్రవ్య అసమతూకాన్ని కనీసం పాక్షికంగా అయినా సరిచేసి రాష్ట్రాలకు అధిక రేటు వచ్చేట్లు చూసిన తరువాత మాత్రమే జిఎస్‌టి(వస్తుసేవల పన్ను) వినియోగంలోకి తేవటం.

## ఆర్థికరంగ క్రమబద్ధీకరణ

*ద్రవ్యంపై రాజ్య అదుపు ఎక్కువగా ఉండే విధంగా, అభివృద్ధి ద్రవ్య పునరుద్ధరణకు సిపిఐ(ఎం) కృషి చేస్తుంది.*

- తారాపోర్ కమిటీ సిఫార్సుల మేరకు పెట్టుబడి ఖాతా పూర్తి కన్వర్టబులిటి దిశగా చేస్తున్న ప్రయత్నాల విరమణ, ద్రవ్య పెట్టుబడి రాకపోకలపై కంట్రోళ్లు తిరిగి విధింపు.

- విదేశీ సంస్థాగత మదుపుదార్లు(ఎఫ్ఐఐ) పార్టిసిపేటరీ నోట్ల వినియోగించడంపై నిషేధం, స్పెక్యులేటివ్ ఫైనాన్స్ నిషేధం
- ప్రయివేటు రంగంలో బ్యాంకులకు కొత్తగా లైసెన్స్‌ల జారీ క్రమాన్ని తక్షణమే నిలుపుదల చేయటం మరియు బ్యాంకింగ్ క్రమబద్ధీకరణ(సవరణ) చట్టం 2012 సమీక్ష
- భారతీయ బ్యాంకులను విదేశీ బ్యాంకులు స్వాధీనం చేసుకోవడాన్ని నిరోధించడం.
- బడా వాణిజ్య సంస్థలు తమ ప్రాజెక్టుల నష్టాలను బ్యాంకులకు బదలాయించడాన్ని నిరోధించడానికి గట్టి చర్యలు, మరియు రుణాల ఎగవేతదార్లపై కఠిన చర్యలు
- బీమా రంగంలో ఎఫ్‌డిఐ పరిమితిని 26 నుంచి 49శాతానికి పెంచే ప్రతిపాదన ఉపసంహరణ
- పెన్షన్ నిధుల ప్రయివేటీకరణ ఉండదు, పెన్షన్ మరియు భవిష్యనిధులను స్టాక్ మార్కెట్లకు మళ్లింపు జరగదు.

## మౌలిక సదుపాయాలు

*సిపిఐ(ఎం) దిగువ వాటికోసం పనిచేస్తుంది*

- మౌలిక సదుపాయాలకు ప్రభుత్వ పెట్టుబడుల పెంపు, విద్యుత్, రోడ్లు, రైల్వే, కమ్యూనికేషన్లు, రేవులు, విమానాశ్రయాలకు తగినన్ని ప్రణాళికా నిధుల కేటాయింపు
- నీటి వనరుల ప్రయివేటీకరణ నిలిపివేత
- జాతీయ స్వయం సమృద్ధి ప్రయోజనాలకు అనుగుణంగా ఇంధన మరియు టెలికాం రంగ విధానాల సమీక్ష, విద్యుత్ మరియు టెలికాం పరికరాల తయారీకి దేశీయ మార్కెట్ వినియోగం
- ప్రయివేటు విద్యుత్ తయారీదార్లకు అనుకూలమైన ధోరణులను తొలగించడం, పంపిణీ కంపెనీల ప్రయివేటీకరణ, ప్రయివేటు సంస్థలకు పట్టణాల అప్పగింతలను నిలిపివేత
- విద్యుత్ చట్టం 2003 సమీక్ష
- గ్రామీణ ప్రాంతాలలో సంధాయకత(కనెక్టివిటీ) మరియు టెలికాం వ్యాప్తిని పెంపొందించేందుకు వీలుగా టెలికాం విధానాల మార్పు
- బ్రాడ్‌బ్యాండ్ వ్యాప్తి పెంపుదల మరియు అందరికీ అందుబాటులో ఇంటర్నెట్
- పిపిపి మార్గంలో మౌలిక సదుపాయాల ప్రయివేటీకరణపై సమీక్ష

- ఇప్పటికే నవీకరించబడిన దేశీయ విమానాశ్రయాల విషయంలో పిపిపి విధానం ఉండదు. రైల్వేలలో ఎఫ్‌డిఐలు ఉండవు.
- గ్రామీణ మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత, గ్రామీణ రోడ్లు, విద్యుత్ వంటి వాటికి కేటాయింపుల పెంపు.

## ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యుటివో) మరియు వాణిజ్య సమస్యలు

*సిపిఐ(ఎం) దిగువ వాటికోసం పనిచేస్తుంది.*

- ప్రస్తుతం కొనసాగుతున్న ప్రపంచ వాణిజ్య సంస్థ దోహా దఫా చర్చలలో అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలను కాపాడటం ద్వారా మన దేశ ప్రయోజనాల రక్షణ; వ్యవసాయ మరియు పారిశ్రామిక వస్తువులకు టారిఫ్ కోతల నిలిపివేత
- ఆహారధాన్యాల సేకరణ మరియు ఆహార విధానాలపై బాలీ డబ్ల్యుటివో మంత్రుల నిర్ణయంపై పార్లమెంట్‌లో సమీక్ష, మరియు పార్లమెంటు అనుమతి లేకుండా అంగీకరించకపోవడం.
- పరిమాణాత్మ పరిమితులతో సహా చిన్న, సన్నకారు రైతుల రక్షణకు చర్యల పునరుద్ధరణ
- గాట్స్ పరిధి నుంచి ఆరోగ్యం, విద్య, నీటి వనరులు, బ్యాంకింగ్ మరియు ఆర్థిక సేవల వంటి వాటి మినహాయింపు;ట్రిప్స్ ఒప్పంద సమీక్షకు వత్తిడి.
- ఇప్పటికే ఉనికిలో ఉన్న స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాలపై సమీక్ష; బ్యాంకింగ్ మరియు బీమా వంటి రంగాలను తెరవాలని, ఐపిఆర్ సమస్యలపై వత్తిడి తెస్తున్న దృష్ట్యా ఐరోపాయూనియన్ మరియు ఎఫ్టాలతో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాలకోసం జరుగుతున్న సంప్రదింపులపై పున:పరిశీలన

## ఫెడరలిజం పటిష్టానికి చర్యలు

*కేంద్ర– రాష్ట్ర సంబంధాలను ఆమూలాగ్రం పునర్వ్యస్తీకరించేందుకు సిపిఐ(ఎం)* కృషి చేస్తుంది

- ఆర్టికల్ 355,356 దుర్వినియోగాన్ని అరికట్టేందుకు సవరణ
- ఆయా రాష్ట్ర ముఖ్యమంత్రి సూచించిన ముగ్గురు ప్రముఖుల జాబితా నుంచి ఒకరిని గవర్నర్లుగా రాష్ట్రపతి నియమించాలి
- పద్నాలుగవ ఆర్థిక సంఘం పరిశీలనాంశాల సమీక్ష మరియు దానికి అంతరాష్ట్ర మండలి ఆమోదం కోరటం

- కేంద్ర పన్నుల వసూలులో సగం రాష్ట్రాలకు చెల్లింపు, మార్కెట్‌ల నుంచి సేకరించే రుణాలలో సగం రాష్ట్రాలకు కేటాయింపు
- పన్నేతర కేంద్ర ప్రభుత్వ ఆదాయంలో కొంత భాగాన్ని విభజించే మొత్తంలో చేర్చటం మరియు దీనికోసం రాజ్యాంగ సవరణ
- ఎఫ్‌ఆర్‌బిఎం చట్టాల వంటి వాటిని రాష్ట్రాలు ఆమోదించాలన్న షరతుల ఉపసంహరణ; ఆర్థిక కమిషన్ల పరిశీలనాంశాలలో రాష్ట్రాల అభిప్రాయాలకూ చోటు ఇవ్వటం
- రాష్ట్రాల అంశాలకు సంబంధించి కేంద్ర ప్రాయోజిత పథకాలను నిధులతో సహా రాష్ట్రాలకు బదిలీ
- అంతరాష్ట్ర మండలి చేసే నిర్ణయాలకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉండే విధంగా రాజ్యాంగ సవరణ; జాతీయ అభివృద్ధి మండలికి రాజ్యాంగ హోదా;జాతీయ అభివృద్ధి మండలి ఒక కార్యనిర్వాహక విభాగంగా ప్రణాళికా సంఘం పనిచేయటం
- స్థానిక సంస్థ ఖర్చులకు జిడిపిలో కనీస స్థాయిలో ఒక లక్ష్యాన్ని నిర్ణయించటం;స్థానిక సంస్థలకు నిధులను రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందచేయటం

## పరిశ్రమలు

*సిపిఐ(ఎం) దిగువ వాటికోసం పనిచేస్తుంది*

- కొత్త పెట్టుబడులు మరియు టెక్నాలజీని ప్రవేశపెట్టటం ద్వారా కీలక మరియు వ్యూహాత్మక రంగాలలో ప్రభుత్వ రంగం విస్తరణ మరియు పటిష్టీకరణ; ప్రభుత్వరంగానికి స్వయంప్రతిపత్తి మరియు సామర్థ్యపెంపుదలకు చర్యలు
- దీర్ఘకాలిక పారిశ్రామిక విధానం ద్వారా ఉత్పాదకరంగ అభివృద్ధికి ప్రాధాన్యత. అది పెట్టుబడుల వ్యూహాన్ని రూపొందించటం, ఉపాధి కల్పనకు ప్రోత్సాహకాలను ఇచ్చేదిగా ఉంటుంది
- రాష్ట్రాలలో పరిశ్రమల ఏర్పాటుకు కనీస ప్రమాణాలు, నిబంధనలు రూపొందించేందుకు ఒక జాతీయ విధాన చట్రాన్ని రూపొందించటం, తద్వారా రాష్ట్రాల మధ్య పోటీతో వేతనాల తగ్గింపు, పని ప్రమాణాలు దిగజారకుండా చూడటం
- ఆచరణాత్మకమైన మరియు లాభాలు ఆర్జిస్తున్న ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ మరియు పెట్టుబడుల ఉపసంహరణ పూర్తిగా నిలిపివేత
- తగినన్ని రాయితీలతో శ్రమశక్తి ఎక్కువగా ఉండే చిన్న, మధ్యతరగతి సంస్థలకు ప్రోత్సాహం, మౌలిక సదుపాయాల మద్దతు, తగినంత బ్యాంకు రుణం

- విచక్షణా రహితంగా దిగుమతి పన్నులను తగ్గించకుండా దేశీయ పరిశ్రమలకు రక్షణ మరియు విదేశీ కంపెనీలు స్వాధీనం చేసుకోకుండా స్వదేశీ కంపెనీలకు రక్షణ; సర్వీసు మరియు ఉత్పత్తి సంస్థలలో ప్రయివేటు పెట్టుబడులకు ప్రోత్సాహం, ఉద్యోగ కల్పన మరియు పరిశోధన, అభివృద్ధిని బట్టి ప్రయివేటు రంగానికి రాయితీల కల్పన
- చిల్లర వాణిజ్యంలో ఎఫ్‌డిఐల నిషేధం; లైసన్సింగ్ విధానం ద్వారా దేశీయ కార్పొరేట్ రిటైలర్ల క్రమబద్ధీకరణ
- దొడ్డిదారిన ఎఫ్‌డిఐల ప్రవేశానికి దోహదం చేసే మార్గదర్శకసూత్రాల రద్దు మరియు దేశీయ పరిశ్రమలను స్వాధీనం చేసుకొనే మార్గం ద్వారా ఎఫ్‌డిఐల నిరోధం; ఉత్పాదక సామర్థ్యం పెంపుదల మరియు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని తెచ్చే మార్గాల ద్వారా విదేశీ పెట్టుబడులకు అనుమతి
- పలు పన్ను రాయితీలను రద్దు చేసేందుకు సెజ్ చట్టం, నిబంధనలకు సవరణ మరియు భూ వినియోగం క్రమబద్ధీకరణ; అన్ని సెజ్‌లలో కార్మిక చట్టాలను కచ్చితంగా అమలు జరిపేట్లు చూడటం
- ఖనిజ రంగం మరింత సరళీకరణ మరియు ప్రయివేటీకరణ నిలిపివేత; స్వంత అవసరాల కోసం ప్రయివేటు రంగానికి కేటాయించి తవ్వకుండా ఉన్న బొగ్గుగనుల స్వాధీనం, కోల్ ఇండియా లిమిటెడ్‌కు తిరిగి అప్పగింత; ఇనుపఖనిజం ఎగుమతుల నిషేధం, బొగ్గు ఇతర ఖనిజాలకు రాయల్టీ ధరల పెంపు
- కోల్ ఇండియా లిమిటెడ్‌ను ఒక యూనిటరీ కంపెనీగా మార్చి పరిశ్రమలు మరియు ఖాతాదార్లకు బొగ్గును సరఫరా చేసే ఏకైక ఏజన్సీగా మార్చటం

## చేతి వృత్తిదారులు, చేనేత కార్మికులు మరియు సాంప్రదాయ పరిశ్రమలు

సిపిఎం దిగువ వాటికోసం పనిచేస్తుంది.

- సాంప్రదాయ పరిశ్రమలైన వస్త్ర, కార్పెట్, హస్తకళలు, తోలు,చేనేత, కొబ్బరి పీచు తదితర పరిశ్రమలను రక్షిస్తుంది.
- ఈ రంగంలో పెట్టుబడులను కంట్రోలు ధరలకు అందచేస్తుంది;డిజైన్, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాల మెరుగుదల మరియు మార్కెటింగ్ తదితర అవసరాల కోసం తగిన వసతులను విస్తరించటం మరియు విస్తరణ సేవలను అందిస్తుంది.
- దుస్థితిలో ఉన్న హస్త కళాకారులు చేనేత వంటి వారికి వారి రుణ భారం,

పోషకాహారలేమి మరియు ఆకలిచావుల నుంచి రక్షించేందుకు రుణాల రద్దు, జీవనానికి భద్రత కల్పిస్తుంది.

## వ్యవసాయ పునరుద్ధరణ

వ్యవసాయ సంక్షోభాన్ని ఎదుర్కొనే చర్యలలో భాగంగా రైతాంగానికి ఆదాయాలు పెంచేందుకు మరియు వ్యవసాయం గిట్టుబాటు అయ్యేందుకు సిపిఐ(ఎం) దిగువ చర్యలను తీసుకోవాలని భావిస్తోంది.

- గ్రామీణ పేదల కొనుగోలు శక్తిని, వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు గ్రామీణ రంగానికి ప్రభుత్వ ఖర్చును గణనీయంగా పెంచటం
- వ్యవసాయ పరిశోధన మరియు విస్తరణ సేవలు అందించేందుకు ప్రభుత్వ సంస్థలను విస్తరించటం మరియు ప్రభుత్వ పెట్టుబడులను పెంచటం
- జాతీయ ఆహార భద్రతను దెబ్బతీసే అధిక ఎగుమతులు మరియు దిగుమతులను నిరోధించేందుకు వాణిజ్య ఆంక్షలను తిరిగి ప్రవేశపెట్టటం
- వాణిజ్య పంటలకు కనీస ధరలను నిర్ణయించేందుకు వస్తు బోర్డులను పునరుద్ధరించటం
- గరిష్టంగా నాలుగుశాతం వడ్డీకి వ్యవసాయ రంగానికి చౌకగా సంస్థాగతమైన రుణాలను అందించటం
- గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు ప్రభుత్వ పెట్టుబడులను పెంచటం మరియు ప్రయివేటీకరణ నిలుపుదల; వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా, సాగునీటి సౌకర్యాల విస్తరణ
- గ్రామీణ మౌలిక సదుపాయాలను మెరుగుపరచటం మరియు కనీస వసతులు కల్పించటం
- న్యూట్రియంట్ ప్రాతిపదికన ఎరువులకు సబ్సిడీలు ఇచ్చే విధానం రద్దు; విత్తన బిల్లు ఉపసంహరణ మరియు రైతాంగ అనుకూలమైన విత్తన చట్టాన్ని రూపొందించటం
- కాంట్రాక్టు వ్యవసాయాన్ని ప్రబోధించే వ్యవసాయ మార్కెట్ కమిటీల చట్టాన్ని ఉపసంహరించటం; వ్యవసాయ మార్కెట్లలో రైతాంగ అనుకూల సంస్కరణలను చేయటం
- అసమాన విదేశీ వాణిజ్య ఒప్పందాలను విసర్జించటం మరియు పార్లమెంట్ తనిఖీకి లోబడి ఉండేలా జాతీయ ఆర్థిక సార్వభౌమత్వ ప్రాతిపదికన అన్నిరకాల వాణిజ్య సంబంధ సంప్రదింపులు జరపటం

- బడా వాణిజ్య సంస్థలకు అనుకూలంగా ఉండే మేథోసంపత్తి హక్కుల విధానంలో ప్రతికూల మార్పులు;జీవ వైవిధ్యాన్ని రక్షించే విధంగా ప్రయివేటు వ్యవసాయ
- పరిశోధనపై గట్టిగా క్రమబద్ధీకరణ చర్యలు

## భూ సమస్యలు

- భూపరిమిత చట్టాలను నీరుగార్చే ప్రస్తుత వైఖరిని వెనక్కు మళ్లించటం; భూ సంస్కరణలను వేగంగా అమలు జరిపేందుకు వేగవంతమైన మరియు సమగ్ర చర్యలు తీసుకోవటం
- ఉమ్మడి అడవులు, గడ్డి భూముల వంటి ఉమ్మడి భూముల ఆక్రమణను నిరోధించటం
- అన్ని ప్రభుత్వ మరియు ప్రభుత్వ రంగ సంస్థల భూముల విక్రయం, కౌలు, ఇతర ప్రయోజనాలకు వినియోగించటం వంటి ఏ ఇతర పద్దతుల్లో అయినా ప్రయివేటు రంగానికి ఇవ్వకుండా రక్షణ
- భూపరిమితికి మించి ఉన్న భూములన్నింటినీ స్వాధీనం చేసుకొని పంపిణీ చేయటం మరియు సాగుకు వీలై వృధాగా పడిఉన్న భూములను భూమిలేని పేదలకు ఉచితంగా అందించటం,ఎస్‌సి,ఎస్‌టిలకు ప్రాధాన్యత ఇవ్వటం, భూమిపై మహిళలకు కూడా సమాన హక్కు ఉండే విధంగా జాయింట్ పట్టాల మంజూరు
- గ్రామీణ మరియు పట్టణాలలోని అన్ని తరగతుల పేదలకు ఇండ్ల స్థలాలు, పెరటి స్థలాలు అందించటం
- కౌలుదార్ల నమోదు మరియు ఎక్కడైతే కౌలుదార్ల నమోదు లేదో అక్కడల్లా వారి హక్కులకు పరిరక్షణ
- రియలెస్టేట్ స్పెక్యులేషన్‌కు భూ ఆక్రమణ నిరోధం
- న్యాయబద్ధమైన పరిహారం మరియు పారదర్శక భూసేకరణ హక్కు, పునరావాస చట్టం 2013కు సవరణ, భూ సేకరణకు అవసరమైన అన్ని చట్టాలకు దీనిని వర్తింపచేయటం, ప్రజాప్రయోజనం అంటే ఏమిటో స్పష్టమైన నిర్వచనం నిర్ధారించటం, బాధిత వ్యక్తులందరికీ ముందుగా తెలియచేయటం, వారి సమ్మతిని తీసుకోవటం, సామాజిక ప్రభావ విశ్లేషణకు కట్టుబడి ఉండటం మరియు పునరావాసం వంటి విషయాలలో మంచి జీవనాన్ని కలిగి ఉండేలా చూడటం పెరిగిన భూ విలువలో వాటా చెల్లించటం

# ఆహార భద్రత మరియు ఆకలి లేని భారతం

*ఆకలి లేని భారత దేశం వైపుగా పయనించేందుకు సిపిఐ(ఎం) కృషి చేస్తుంది. దిగువ అంశాలతో కూడిన ఆహార హక్కు చట్టాన్ని తీసుకు వస్తుంది.*

- పెట్రోలియం ఉత్పత్తులపై కేంద్ర ఎక్సైజ్ మరియు కస్టమ్స్ పన్నుల తగ్గింపు
- సహజవాయు ధరలపై నియంత్రణ మరియు కెజి గ్యాస్ బేసిన్ గ్యాస్ ధరల పెంపు ఉపసంహరణ
- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు వ్యవసాయ ఉత్పత్తుల ముందస్తు వాణిజ్యంపై నిషేధం
- అత్యవసర వస్తువుల అక్రమ నిల్వలు, బ్లాక్‌మార్కెటింగ్‌పై కఠిన చర్యలు మరియు ఇందుకోసం అత్యవసర వస్తువుల చట్టంలోని అంశాల పటిష్టీకరణ
- గోదాములు, గిడ్డంగులలో ప్రయివేటు నిల్వలను వెల్లడించే నిబంధనలను పటిష్టపరచటం
- పెరుగుతున్న మార్కెట్ ధరలను అదుపులో ఉంచేందుకు ప్రభుత్వ పంపిణీ వ్యవస్థను పటిష్టపరచటం మరియు నిల్వలను వివేకముతో ఉపయోగించుకోవటం
- ధరలు పెరుగుతున్నపుడు తగ్గుతున్నపుడు ఆహారధాన్యాల ఎగుమతిపై అదుపు
- అత్యవసర ఔషధాల ధరలను అదుపులో ఉంచేందుకు చర్యలు

## విదేశాంగ విధానం

*దిగువ అంశాలతో కూడిన విదేశాంగ విధానం కోసం సిపిఐ(ఎం) కృషి చేస్తుంది.*

- బహుళ ధృవ ధోరణులు పెంపొందించేందుకు స్వతంత్రమైన, అలీన విదేశాంగ విధానం. బ్రిక్స్(బిఆర్ఐసిఎస్) మరియు ఇబ్సా(ఐబిఎస్ఏ) పటిష్టానికి కృషి. షాంఘై సహకార సంస్థలో పూర్తి సభ్యురాలిగా చేరటం.
- దేశాల మధ్య ఉన్న వివాదాలను పరిష్కరించేందుకు ఐరాస వంటి బహుముఖ వేదికలను పటిష్టపరచటం; భద్రతామండలి మరియు ఐరాస వ్యవస్థను ప్రజాస్వామ్యీకరించటం
- గతంలో లిబియా ఇప్పుడు చోటు చేసుకుంటున్న సిరియా, ఉక్రెయిన్లలో మాదిరి ఐక్యరాజ్యసమితి మరియు నాటో రుద్దిన జోక్యాలు మరియు ప్రభుత్వాల మార్పిడులకు వ్యతిరేకత
- పశ్చిమాసియా మరియు ఆగ్నేయాసియాలతో సంబంధాల పటిష్టీకరణ మరియు లాటిన్ అమెరికన్ మరియు కరీబియన్ దేశాలతో సంబంధాలను నెలకొల్పుకోవటం
- అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం పాకిస్థాన్‌తో చర్చల కొనసాగింపు; భారత్-పాకిస్థాన్ మధ్య ప్రజల సంబంధాలను పెంపొందించటం
- బంగ్లాదేశ్‌లో సంబంధాలు మరియు ఒప్పందాలు చేసుకొనేందుకు ప్రత్యేక

- పెట్రోలియం ఉత్పత్తులపై కేంద్ర ఎక్సైజ్ మరియు కస్టమ్స్ పన్నుల తగ్గింపు
- సహజవాయు ధరలపై నియంత్రణ మరియు కెజి గ్యాస్ బేసిన్ గ్యాస్ ధరల పెంపు ఉపసంహరణ
- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు వ్యవసాయ ఉత్పత్తుల ముందస్తు వాణిజ్యంపై నిషేధం
- అత్యవసర వస్తువుల అక్రమ నిల్వలు, బ్లాక్‌మార్కెటింగ్‌పై కఠిన చర్యలు మరియు ఇందుకోసం అత్యవసర వస్తువుల చట్టంలోని అంశాల పటిష్టీకరణ
- గోదాములు, గిడ్డంగులలో ప్రయివేటు నిల్వలను వెల్లడించే నిబంధనలను పటిష్టపరచటం
- పెరుగుతున్న మార్కెట్ ధరలను అదుపులో ఉంచేందుకు ప్రభుత్వ పంపిణీ వ్యవస్థను పటిష్టపరచటం మరియు నిల్వలను వివేకముతో ఉపయోగించుకోవటం
- ధరలు పెరుగుతున్నపుడు తగ్గుతున్నపుడు ఆహారధాన్యాల ఎగుమతిపై అదుపు
- అత్యవసర ఔషధాల ధరలను అదుపులో ఉంచేందుకు చర్యలు

## విదేశాంగ విధానం

*దిగువ అంశాలతో కూడిన విదేశాంగ విధానం కోసం సిపిఐ(ఎం) కృషి చేస్తుంది.*

- బహుళ ధృవ ధోరణులు పెంపొందించేందుకు స్వతంత్రమైన, అలీన విదేశాంగ విధానం. బ్రిక్స్(బిఆర్ఐసిఎస్) మరియు ఇబ్సా(ఐబిఎస్ఏ) పటిష్టానికి కృషి.షాంఘై సహకార సంస్థలో పూర్తి సభ్యురాలిగా చేరటం.
- దేశాల మధ్య ఉన్న వివాదాలను పరిష్కరించేందుకు ఐరాస వంటి బహుముఖ వేదికలను పటిష్టపరచటం; భద్రతామండలి మరియు ఐరాస వ్యవస్థను ప్రజాస్వామ్యీకరించటం
- గతంలో లిబియా ఇప్పుడు చోటు చేసుకుంటున్న సిరియా, ఉక్రెయిన్లలో మాదిరి ఐక్యరాజ్యసమితి మరియు నాటో రుద్దిన జోక్యాలు మరియు ప్రభుత్వాల మార్పిడులకు వ్యతిరేకత
- పశ్చిమాసియా మరియు ఆగ్నేయాసియాలతో సంబంధాల పటిష్టీకరణ మరియు లాటిన్ అమెరికన్ మరియు కరీబియన్ దేశాలతో సంబంధాలను నెలకొల్పుకోవటం
- అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం పాకిస్థాన్‌తో చర్చల కొనసాగింపు; భారత్-పాకిస్థాన్ మధ్య ప్రజల సంబంధాలను పెంపొందించటం
- బంగ్లాదేశ్‌లో సంబంధాలు మరియు ఒప్పందాలు చేసుకొనేందుకు ప్రత్యేక

ప్రయత్నాలు. భూ సరిహద్దు ఒప్పందానికి ఆమోదం మరియు తీస్తా నది జలాల ఒప్పందాన్ని పరిష్కరించుకోవటం

- ఐక్య శ్రీలంక పరిధిలో తమిళ భాష మాట్లాడే పౌరుల స్వయంప్రతిపత్తి కోసం ఉత్తర మరియు తూర్పు ప్రాంతాలకు అధికారాల బదిలీ కోసం లంక ప్రభుత్వంతో సంప్రదింపులు. అంతర్యుద్ధం చివరి దశలో జరిగిన అత్యాచారాలపై విశ్వసనీయమైన స్వతంత్ర విచారణ కోసం కృషి.
- పాలస్తీనా దేశానికి పూర్తి మద్దతు; ఇజ్రాయెల్‌తో మిలిటరీ మరియు భద్రతా సంబంధాల రద్దు

## భద్రతా సమస్యలు

*భద్రతా సమస్యలకు సంబంధించి సిపిఐ(ఎం) దిగువ చర్యలకు పనిచేస్తుంది.*

- భారత్- అమెరికా అణు ఒప్పందంలో మార్పులు; విదేశీ అణు రియాక్టర్ల దిగుమతి ఉండదు; దేశీయంగా ఉన్న యురేనియం మరియు థోరియం నిల్వలను ఉపయోగించుకొని పౌర అణువిద్యుత్ రంగంలో స్వయం సమృద్ధి.
- ఐక్య రాజ్యసమితి ద్వారా విశ్వవ్యాపిత అణు నిరాయుధీకరణకు కృషి; అణు పరీక్షల మారొటోరియంపై పార్లమెంట్ అనుమతి తీసుకోవాలి;దక్షిణాసియాలో అణ్వస్త్ర రహిత పరిస్థితులు నెలకొల్పేందుకు కృషి; హిందూ మహా సముద్రంలోని అమెరికా సైనిక కేంద్రం డిగోగార్సియా నుంచి అణ్వాయుధాల తొలగింపుకు కృషి
- అంతరిక్ష నిస్సైనికీకరణకు అవసరమైన విధానాలకోసం పనిచేయటం
- సైబర్ దాడులు మరియు నిఘా నుంచి భారత ఇంటర్నెట్ మరియు టెలికమ్యూనికేషన్ నెట్‌వర్కుల రక్షణకు దేశీయ సామర్థ్య నిర్మాణం
- అమెరికాతో రక్షణ చట్ర ఒప్పంద పునరుద్ధరణ జరగదు. అమెరికాతో మిలిటరీ సహకారం ఒప్పందాల తదుపరి చర్యల నిలిపివేత. దక్షిణాసియాలో విదేశీ మిలిటరీ కేంద్రాలు లేకుండా చూసేందుకు అవసరమైన విధానానికి కృషి
- పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ చట్ర పరిధిలోనే పనిచేసే జాతీయ భద్రతా ఉపకరణాల సృష్టి
- మావోయిస్టు హింసాకాండను ఎదుర్కొనే అంశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం అవసరం. ఇదే సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సామాజిక-ఆర్థిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలను తీసుకోవాలి, ప్రత్యేకించి మావోయిస్టు సమస్య తలెత్తిన ప్రాంతాలలోని గిరిజనుల సమస్యలను పరిష్కరించాలి. మావోయిస్టు సమస్యను ఒక భద్రతా సమస్యగా చూడరాదు.

## లౌకికతత్వ పరిరక్షణ కోసం

*మతం మరియు రాజకీయాలను విడదీసేందుకు సిపిఐ(ఎం) కృషి చేస్తుంది. దీన్ని గట్టిగా అమలు జరిపేందుకు అవసరమైన అన్ని చట్టపరమైన చర్యలు తీసుకుంటుంది. మత హింసాకాండ పట్ల కఠినంగా వ్యవహరిస్తుంది. అన్ని రంగాలలో రాజ్యం లౌకిక విలువలను ప్రోత్సహించాలి. అందుకోసం సిపిఐ(ఎం) కృషి చేస్తుంది.*

- మత హింసాకాండకు వ్యతిరేకంగా సమగ్ర చట్టాన్ని తీసుకు వస్తుంది. ఫెడరల్ చట్రానికి భంగం కలగకుండా మతహింసాకాండకు గురైన బాధితులకు తగిన నష్టపరిహారం అందించేందుకు, త్వరగా న్యాయం జరిగేందుకు కృషి చేస్తుంది.
- మత హింసను ప్రేరేపించే వారు ప్రభుత్వం లేదా అధికారంలో ఎంతటి స్థాయిలో ఉన్నవారైనప్పటికీ మరొకరు పాల్పడకుండా ఉండే విధంగా శిక్షించేందుకు ప్రయత్నిస్తుంది
- ఎలాంటి భయం మరియు వివక్ష లేకుండా మైనారిటీలు గౌరవప్రదమైన మరియు సమానత్వంగా జీవించేందుకు వారి హక్కులను రక్షిస్తుంది.
- స్కూలు పాఠ్యపుస్తకాలలో మతపరమైన దురభిమానం మరియు పక్షపాతం చూపే అంశాలన్నింటినీ పూర్తిగా తొలగిస్తుంది
- మత విద్వేషాన్ని విస్తరింపచేయటంలో నిమగ్నమైన సంస్థలకు వ్యతిరేకంగా చర్యలు మరియు తగిన చట్టపరమైన తీసుకుంటుంది మరియు మైనారిటీలపై దాడులు జరిపే వారిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకుంటుంది.

## ఉగ్రవాదానికి వ్యతిరేక చర్యలు

*ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దిగువ చర్యలు తీసుకొనేందుకు సిపిఐ(ఎం) కృషి చేస్తుంది.*

- నిఘా యంత్రాంగాన్ని పటిష్ట పరచటం మరియు భద్రత మరియు నిఘా విభాగాల మధ్య మరింత సమన్వయం పెంచేందుకు ప్రయత్నం
- ఫెడరల్ వ్యవస్థను ఉల్లంఘించకుండా జాతీయ దర్యాప్తు సంస్థ పనిచేయటం మరియు సంబంధిత రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసే విధంగా చూస్తుంది
- పోలీసు బలగాల ఆధునికీకరణ
- బెయిల్ లేకుండా 180 రోజుల పాటు నిర్బంధం మరియు సమాచారాన్ని వెల్లడించనందుకు మూడు సంవత్సరాల పాటు జైలు శిక్ష వంటి నిర్దాక్షిణ్య అంశాలను తొలగించేందుకు చట్టవ్యతిరేక చర్యల నిరోధ చట్టానికి సవరణ

## జమ్మూ-కాశ్మీర్

*జమ్మూ-కాశ్మీర్ సమస్య విషయంలో సిపిఐ(ఎం) దిగువ వైఖరిని కలిగి ఉంటుంది.*

- రాజ్యాంగంలోని 370 ఆర్టికల్ పరిధిలో దాని ప్రాతిపదికగా రాష్ట్రానికి గరిష్ట స్వయం ప్రతిపత్తిని కలిగించే ఒక రాజకీయ పరిష్కారానికి కృషి చేస్తుంది. జమ్ము, కాశ్మీర్, లడఖ్ ప్రాంతాలకు ప్రాంతీయ స్వయం ప్రతిపత్తి కలిగించేందుకు కృషి చేస్తుంది.
- అమాయక పౌరులపై భద్రతా దళాల దుష్ప్రవర్తనను అరికట్టేందుకు గట్టి చర్యలు తీసుకోవటం; పాత్రిబల్ కేసులో న్యాయానికి జరిగిన అవహేళనను సరిదిద్దేందుకు ఆ కేసు న్యాయ సమీక్షకు నివేదించటం
- రాష్ట్ర ఆర్థికాభివృద్ధి జరిగేట్లు చూడటం, ప్రత్యేకించి యువతకు ఉద్యోగాల కల్పనపై కేంద్రీకరణ మరియు ధ్వంసమైన మౌలిక సదుపాయాల పునర్నిర్మాణం

## ఈశాన్య ప్రాంతం

ఈశాన్య రాష్ట్రాల సమస్యలపై సిపిఐ(ఎం) దిగువ వైఖరి కలిగి ఉంటుంది.

- అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన దానిగా ఈశాన్య ప్రాంత ప్రకటన; యువతకు ప్రత్యేక ఉపాధి మరియు భౌతిక మౌలికసదుపాయాల అభివృద్ధి, సరిహద్దు కంచ నిర్మాణం త్వరగా పూర్తి చేయటం
- ఆరవ షెడ్యూలు కింద పాలనాపరమైన మరియు ఆర్థిక అధికారాల విస్తరణ మరియు రక్షణ; వివిధ స్థానిక తెగల, జాతుల గుర్తింపునకు రక్షణ
- జాతి వివక్ష వ్యతిరేక చట్టాన్ని చేయటం మరియు దేశంలోని ఇతర ప్రాంతాలలో ఉన్న ఈశాన్య రాష్ట్రాల పౌరులకు విస్తృతమైన భద్రత కలిగించటం.

# ప్రజల హక్కులు, జీవన భద్రత మరియు సామాజిక న్యాయం కోసం

## కార్మికవర్గం

*సిపిఐ(ఎం) ఈ క్రిందివాటికోసం కృషి చేస్తుంది.*

- కార్మికులకు చట్టబద్ధమైన కనీస వేతనం పదివేల రూపాయలు నిర్ణయించటం, కనీస వేతనాన్ని వినియోగదారుల ధరల సూచికకు లంకె పెట్టటం, పదిహేనవ అంతర్జాతీయ లేబర్ కాంగ్రెస్ సిఫార్సులు మరియు రాప్టకోస్-బ్రెట్ కేసులో సుప్రీం కోర్టు తీర్పు ప్రాతిపదికగా వేతన సవరణ; కాలం చెల్లిన ధరల సూచికలను తిరిగి నిర్మించటం

- అంతరాష్ట్ర కార్మికుల వలసలపై ఉన్న చట్టంతో సహా అన్ని కార్మిక చట్టాలను పూర్తిగా గట్టిగా అమలు జరపటం; కార్మికశాఖలను పటిష్టపరచటం మరియు వాటిని అమలు జరపాల్సిన కార్మిక/ఫ్యాక్టరీ తనిఖీ సంస్థలతో సహా అన్నింటికీ తగిన మానవ శక్తిని మరియు సౌకర్యాలను కల్పించటం, పారిశ్రామిక ట్రిబ్యునల్స్ మరియు కార్మిక కోర్టులలో న్యాయమూర్తులు మరియు సహాయ సిబ్బంది ఖాళీలన్నింటినీ పూర్తి చేయటం
- అసంఘటిత రంగ కార్మికుల చట్టాలను మెరుగుపరచటం మరియు కార్మికులపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సుల అమలు, తోటల మరియు వలస కార్మికులకు ప్రత్యేక భద్రతా చర్యలు, ఒకే గవాక్షం ద్వారా కార్మికులందరికీ అందుబాటులో ఉండే విధంగా కఠినమైన పారిశ్రామిక మరియు వృత్తిపరమైన వర్గీకరణ బోర్డుల చట్టాన్ని రద్దు చేయటం, తగినన్ని బడ్జెట్ కేటాయింపులతో అసంఘటితరంగ కార్మికులకు జాతీయ నిధి ఏర్పాటు, దారిద్ర్యరేఖ నిబంధనలతో నిమిత్తం లేకుడా అసంఘటితరంగ కార్మికులందరికీ వృద్ధాప్యపెన్షన్, మెటర్నీటీతో సహా ఆరోగ్య, శిశుసంరక్షణ, ప్రమాద, జీవిత బీమా సౌకర్యాల వంటి కనీసం సామాజిక భద్రతా లబ్ధులను కలిగించటం
- నూతన పెన్షన్ స్కీము మరియు పిఎఫ్ఆర్‌డిఏ చట్టం రద్దు, దానిస్థానంలో కార్మికులు/ ఉద్యోగులందరికీ లబ్దిని నిర్వచించే పెన్షన్ పథకం ప్రవేశపెట్టటం, దానికి యజమానులు మరియు ప్రభుత్వం తగినన్ని నిధులు సమకూర్చటం, కనీసంగా చివరి వేతనంలో ధరల సూచికతో కూడి 50శాతం వేతనం పెన్షన్ వచ్చేట్లు చూడటం
- కార్మిక సంఘాలకు రహస్య బ్యాలట్ ద్వారా గుర్తింపు నివ్వటం మరియు కార్మిక సంఘాల హక్కులకు రక్షణ; అన్ని సంస్థలలో గుర్తింపు యూనియన్ విధిగా ఉండేట్లు చేయటం, అంతర్జాతీయ కార్మిక సంస్థ సదస్సు చేసిన 87,98 అంశాలైన కార్మిక సంఘాల ఏర్పాటు స్వేచ్ఛ, ఉమ్మడి బేరసారాల హక్కులను ఆమోదించటం, ప్రభుత్వ మరియు ప్రయివేటు రంగం రెండింటి యాజమాన్యాలలో కార్మికుల భాగస్వామ్యం కలిగి ఉండేందుకు పటిష్టమైన పథకాన్ని రూపొందించటం
- కాంట్రాక్టు, కాజువల్ పని విధానాన్ని నిరుత్సాహపరచటం; కాంట్రాక్టు లేబర్(క్రమబద్ధీకరణ మరియు రద్దు) చట్టాన్ని గట్టిగా అమలు జరపటం, ఒకే విధమైన పని చేసే కాంట్రాక్టు కార్మికులకు పర్మనెంట్ కార్మికులతో సమంగా వేతనాలు, కాంట్రాక్టు కార్మికుల హక్కులకు రక్షణ, అసంఘటిత రంగంలో కార్మిక సంఘాలను ఏర్పాటు చేసుకొనే హక్కు, కార్మిక సంఘాలలో వారికి పూర్తి సభ్యత్వ హక్కు, యూనియన్ గుర్తింపు ఎన్నికలు, సమ్మెల సందర్భంగా ఓటింగ్ హక్కు

- అన్ని రకాల పనులలో మహిళా కార్మికులకు సమాన ప్రతిఫలం వచ్చేట్లు చూడటం, ప్రసూతి సౌకర్యాలతో సహా అసంఘటిత రంగం, ఇళ్లనుంచి పనిచేసే వారితో సహా పెన్షన్, ఆరోగ్యబీమా సామాజిక భద్రతా చర్యలను వర్తింప చేయటం, మహిళా కార్మికులు పనిచేసే అన్నిచోట్లా క్రెచి సదుపాయాల ఏర్పాటు
- పని స్థలాల్లో లైంగిక వేధింపుల నిరోధానికి తగు చర్యలు తీసుకోవటం, పని స్థలాల్లో లైంగిక వేధింపుల నిరోధ చట్టం ప్రకారం స్థానిక మరియు పని స్థలాల కమిటీలను ఎన్నికైన ప్రతినిధులతో ఏర్పాటు. గృహాలు, పొలాలను కూడా ఈ చట్టపరిధిలోకి తేవటం
- పలు కేంద్ర, రాష్ట్ర పథకాలైన అంగన్‌వాడీ వర్కర్స్ మరియు సహాయకులు, ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, పారా టీచర్లు,ఎన్‌సిఎల్‌పి సిబ్బంది వంటి వారికి అంతర్జాతీయ కార్మిక కాంగ్రెస్ సిఫార్సు 45 ప్రకారం కార్మికులుగా గుర్తింపు నివ్వటం మరియు వారికి చట్టబద్ధమైన కనీస వేతనాలతో సహా హాజరైనందుకు ఇచ్చే అలవెన్సులు, సామాజిక భద్రతా పథకాలైన పెన్షన్ వంటివి మరియు వారికి కార్మిక సంఘాల హక్కులు లభించేట్లు చూడటం

## రైతాంగం

- వ్యవసాయం గిట్టుబాటు అయ్యేందుకు వీలుగా రైతులపై నియమించిన జాతీయ కమిషన్ సిఫార్సు చేసిన రైతాంగ అనుకూలమైన అంశాల అమలు
- అన్ని పంటలకు అన్ని ఖర్చులు వచ్చే విధంగా స్థిరమైన మరియు గిట్టుబాటు ధరలను అందించేట్లు చూడటం, కుటుంబ సభ్యుల శ్రమతో సహా అన్ని రకాల ఖర్చులపై 50శాతం అదనంగా వచ్చేట్లుగా కనీస మద్దతు ధరల పెంపుదల
- అన్ని పంటలను సకాలంలో సేకరించేందుకు అన్ని ప్రాంతాలలో సేకరణ సౌకర్యాల విస్తరణ
- దుస్థితిలో ఉన్న రైతాంగానికి సమగ్రమైన రుణ భారం తగ్గింపు మరియు సంస్థాగత, ప్రయివేటు వడ్డీవ్యాపారులు ఇచ్చిన రుణాల రద్దు
- కౌలు రైతులు, పాలికి చేసే వారితో సహా రైతులందరికీ పంటలు, పశువుల బీమా పథకం వర్తింపు, చిన్న, సన్నకారు రైతులకు అదనపు సబ్సిడీలు
- సకాలంలో నమ్మకమైన విధంగా రైతులందరికీ భరించగలిగిన ధరలతో ఉన్నత, నాణ్యమైన పెట్టుబడులు అందించేందుకు కృషి
- రైతుల సంప్రదాయ విత్తనాల హక్కు పరిరక్షణ మరియు జీవవైవిధ్యాన్ని కాపాడటం అదే విధంగా అన్ని విత్తనాలను రెండవ సారి వినియోగించే విధంగా చూడటం

- నిరంతర జలవనరుల యాజమాన్య పద్ధతులతో పాటు జాతీయ భూ పునరుద్ధరణ మరియు పున:సంపూర్ణం చేసే కార్యక్రమం
- రేగా పథకం కింద చిన్న, సన్నకారు రైతాంగానికి కార్మిక సబ్సిడీ వర్తింపు
- నీటి వినియోగం, పెట్టుబడుల కొనుగోలు, పంటల నిల్వ, ఉత్పత్తుల మార్కెటింగ్, పాడి అభివృద్ధికి సహకార సంస్థలకు ప్రోత్సాహం మరియు పటిష్టీకరణ

## వ్యవసాయ కార్మికులు

- వ్యవసాయ కార్మికులకు రోజుకు కనీస వేతనం రు.300లకు పెంపుదల; వ్యవసాయ కార్మిక మహిళలకు సమానవేతనాలు వచ్చేట్లు చూడటం
- కనీస వేతనాల చట్టం అమలు జరపాల్సిన అమలు యంత్రాంగం క్రమబద్ధీకరణ మరియు పటిష్టపరచటం, చట్టం గట్టిగా అమలు జరిపేట్లు చూడటం
- రేగా పథకంలో పరిమితి వందరోజుల ఎత్తివేత,పని కల్పించని పక్షంలో కార్మికులకు నిరుద్యోగ భృతి చెల్లింపు
- వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించేలా విడిగా సమగ్రమైన చట్టం చేయటం, ఉమ్మడి బేరసారాలాడే హక్కు, కేంద్ర నిధులతో సామాజిక భద్రతా పథకాలైన పెన్షన్లు, ప్రమాద పరిహారం చెల్లింపు
- వ్యవసాయ కార్మికులకు ఉచితంగా భూ పున:పంపిణీ; అన్ని గ్రామీణ కుటుంబాలకు పెరళ్లు సమకూర్చటం, గ్రామీణ కార్మికులందరికీ ఇళ్ల నిర్మాణం
- భూసేకరణ మరియు తొలగింపు సందర్భాలలో పూర్తి పునరావాస పరిహారం పొందేందుకు ప్రభావితులైన వ్యవసాయ కార్మికుల హక్కులను గుర్తించటం
- ఆరోగ్యాన్ని దెబ్బతీసే ఎండోసల్ఫాన్ వంటి పురుగుమందుల వినియోగంపై నిషేధం మరియు పురుగు మందుల కారణంగా జబ్బులపాలైన వ్యవసాయ కార్మికులకు ఉచితంగా వైద్య సదుపాయం అందించటం
- దళిత మరియు ఆదివాసీ కార్మికుల రాజ్యాంగ హక్కులకు రక్షణ మరియు దళిత, గిరిజన నివాస ప్రాంతాల అభివృద్ధి
- దేశంలో ఎక్కడకు వలస వెళ్లినా వారి రక్షణకు ఏకగవాక్షం ద్వారా వికేంద్రీకరించబడిన త్రిపక్ష బోర్డుల ద్వారా వ్యవసాయ కార్మికులందరికీ పూర్తిగా సామాజిక భద్రత చేకూర్చటం

## మత్స్య కార్మికులు

- మత్స్య కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు మరియు వారికి గుర్తింపు

కార్డుల అందచేత, సామాజిక భద్రతా పథకాల వర్తింపు

- విదేశీ ట్రాలర్లపై నిషేధం మరియు బడా ట్రాలర్ల ద్వారా వినాశకరమైన పద్ధతుల్లో చేపలు పట్టటం నిషేధం
- నీటి వనరుల్లో చేపలు పట్టే హక్కును గుర్తిస్తూ మత్స్య కార్మికుల మరియు కోస్తా ప్రాంతాల నివాసితులు మరియు చేపలు పట్టి జీవించే వారి రక్షణకు కోస్తా జోన్ నియంత్రణ చట్టం మరియు 2011 నోటిఫికేషన్‌లకు సవరణ, రుణాల ఎత్తివేతకు పథకం

## మహిళలు

- రాజ్య సభ ఆమోదించిన పార్లమెంట్ మరియు రాష్ట్రాల చట్టసభలలో మూడోవంతు రిజర్వేషన్ల బిల్లు లోక్‌సభలో ఆమోదం మరియు అమలుకు ప్రాధాన్యత
- మహిళలు మరియు పిల్లలపై భయంకరంగా పెరుగుతున్న హింస నివారణ మరియు అందుకు బాధ్యులైన వారిని శిక్షించేందుకు దిగువ పేర్కొన్న వాటితో అనేక చర్యలు తీసుకోవటం
- ప్రస్తుతం సవరించబడిన చట్టం నుంచి వదలి వేయబడిన వర్మ కమిటీ సిఫార్సులకు ఆమోదం; లింగ సమానత్వానికి సంబంధించిన అంశాలను చేర్చేందుకు విద్య సిలబస్‌లో మార్పులు; బహిరంగ స్థలాల్లో మహిళల రక్షణకు చర్యలు; అశక్తులైన మహిళలు అన్ని బహిరంగ స్థలాలకు సురక్షితంగా చేరేట్లు చూడటం; షెడ్యూలు కులాలు మరియు తెగలకు చెందిన మహిళలపై కులపరమైన నేరాలకు శిక్షలను పెంచటం; కేసులను ఆలశ్యం చేసినా, నీరుగార్చేందుకు చూసినా పోలీసులతో సహా ఏ వ్యక్తికి అయినా జరిమానా విధించటం; సత్వర న్యాయ కోర్టుల ఏర్పాటు;అత్యాచార బాధితులకు మద్దతు మరియు యాసిడ్ దాడులకు గురైన వారికి ప్రత్యేకించి అత్యాచారాలకు గురైన పిల్లలకు పూర్తి నిధులతో పునరావాస కల్పనపథకం; గృహ హింస మరియు లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఉన్న చట్టాల అమలుకు తగినన్ని బడ్జెట్ కేటాయింపులు. లింగ నిర్ధారణ పరీక్షలు, ఆడశిశు భ్రూణ హత్యల నిరోధక పిసిపిఎన్‌డిటి చట్టం గట్టిగా అమలు మరియు పనిచేయని పర్యవేక్షణ కమిటీలను పునరుద్ధరించటం
- దిగువ పేర్కొన్న కొత్త చట్టాలు తెచ్చేందుకు కృషి: పరువు నేరాలుగా పిలుస్తున్న చర్యలకు వ్యతిరేకంగా ప్రత్యేకంగా స్వతంత్రంగా పనిచేసే ఒక చట్టం;మహిళలు, పిల్లలను విక్రయించటానికి వ్యతిరేకంగా ఒక చట్టం; వివాహితులైన వారికి సంయుక్త

ఆస్థి హక్కులకోసం ఒక చట్టం; మహిళలు మరియు పిల్లలకు మనోవర్తి చట్టాన్ని పటిష్ట పరచటం, త్రిపుర వామపక్ష ప్రభుత్వం చేసిన మాదిరి వదలివేయబడిన మహిళలకు సాయం, వితంతువులతో సహా ఒంటరి మహిళలు, మహిళలే కుటుంబపెద్దగా ఉన్న కుటుంబాలకు ప్రత్యేక పథకం;స్వయం సహాయక బృందాలు మరియు బ్యాంకింగ్ సంస్థలకు సంబంధాలు కల్పించటం మరియు స్వయం సహాయ బృందాలలోని ఎస్‌సి/ఎస్‌టి మహిళలకు నాలుగుశాతం కంటే ఎక్కువ వడ్డీ వసూలు చేయకుండా సబ్సిడీకి హామీ, గృహ కార్మికులు మరియు ఇళ్లనుంచి పనిచేసే కార్మికుల రక్షణకు ఒక చట్టం

- మతం లేదా సంప్రదాయం పేరుతో మహిళలు, బాలికలకు వ్యతిరేకంగా జరుగుతున్న పద్ధతులకు వ్యతిరేకంగా సామాజిక సంస్కరణల కోసం జరిపే పోరాటాలను ప్రోత్సహించటం, ఇళ్లు, బహిరంగ స్థలాల్లో మహిళలపై జరుగుతున్న హింసా సంస్కృతికి వ్యతిరేకం
- మహిళలకు వ్యతిరేకంగా వారిని అవమాన పరిచే, అశ్లీల చర్యలు, భాషను వినియోగించకుండా బహిరంగంగా చేసే ప్రకటనలు, వ్యాఖ్యలు మర్యాదపూర్వకంగా ఉండే విధంగా వివిధ రంగాలలో ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఒక ప్రవర్తనా నియమావళిని రూపొందించి పాటించేట్లు చూడటం

-బడ్జెట్‌లో ప్రస్తుతం ఉన్నట్లు చెబుతున్న 30శాతానికి బదులు మహిళలకు కేటాయింపులు 40శాతానికి పెంచటం

## బాలలు

*పిల్లల హక్కుల గురించి గట్టిగా నిలబడటమే గాక సిపిఐ(ఎం) వాటి సాధన కోసం పని చేస్తుంది. దిగువ చర్యలు అమలు జరిపేందుకు కట్టుబడి ఉంటుంది.*

- ఆరు సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఐసిడిఎస్ పథకం వర్తింపు. ఐసిడిఎస్ ప్రయివేటీకరణకు దారితీసే అన్ని చర్యలను ఉపసంహరిస్తుంది. అంగన్‌వాడీలు మరియు స్కూళ్లలో పోషకాహార సరఫరాకు తలసరి కేటాయింపుల పెంపుదల
- మూడు నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సుగల పిల్లలందరికీ వర్తించే విధంగా విద్యాహక్కు చట్టం విస్తరణ. అశక్తులైన పిల్లలందరికీ ప్రత్యేక చర్యలు.
- అన్ని రకాల బాలకార్మికులను నిషేధించేందుకు గాను అపాయకరమైన మరియు అపాయకరము కాని అన్నతేడాను బాల కార్మికుల నిషేధం మరియు క్రమబద్ధీకరణ చట్టానికి సవరణలు మరియు బాలకార్మికులందరికీ పునరావాసం అదనపు నిధులతో అన్ని పథకాల అమలు

- ఆదివాసీ, దళితులు మరియు సామాజికం?ా వెనుకబడిన తరగతుల పిల్లలకు ఇతరులకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేం సుకు ప్రత్యేక చర్యల ద్వారా దళితులు మరియు గిరిజన పిల్లలకు ఆధునిక వస ులతో రెసిడెన్సియల్ స్కూళ్లుమరియు హాస్టళ్ల ఏర్పాటుకు అదనపు నిధుల కేటా యింపు; ఏ స్థాయిలో వివక్ష చూపినా కఠిన చర్యలు
- మౌలిక సేవలైన అనుబంధ పోషకాలు, టీకాలు, పాఠశాల పూర్వ అనియత విద్య, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు, వెంటనే పై ఆసుపత్రులకు పంపే సేవలు ప్రతిఒక్కరికీ అందచేత
- తప్పి పోయిన పిల్లలను కనుగొనేందుకు గట్టి చర్యలు, వెతికే చర్యల స్థితిని పౌరులకు నివేదించేందుకు కృషి
- అశ్లీల నేరాల చట్టం నుంచి పిల్లలను రక్షించేందుకు గట్టి చర్యలు, చట్ట అమలు
- పిల్లల రక్షణ కొరకు జాతీయ మరియు రాష్ట్ర బాలల కమిషన్లకు నిధులు మరియు అధికారాల బదలాయింపు
- వీధి పిల్లలకు వసతి కల్పన మరియు సామాజిక సేవల అందచేత
- బాల నేరస్థుల న్యాయ వ్యవస్థ పూర్తిగా ప్రక్షాళన మరియు సంస్కరణకు కృషి, అటువంటి వారిని తిరిగి సమాజంలోకి తీసుకొని బాధ్యత గల పౌరులుగా తయారు చేయడానికి అవసరమైన సంస్థలను ఏర్పాటుచేసి వేగవంతం చేయడం.

## యువజనులు

*యువజనుల కోసం దిగువ చర్యలు తీసుకొనేందుకు సిపిఐ(ఎం) కృషి చేస్తుంది.*

- పని హక్కును రాజ్యాంగ బద్ధం చేయటం
- ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై విధించిన నిషేధాల ఎత్తివేత. నిర్ణీత కాల వ్యవధి చట్రంలో అన్ని ఖాళీ పోస్టుల భర్తీ
- యువతరం ఎదుర్కొంటున్న సమస్యలను తగిన విధంగా పరిష్కరించేందుకు జాతీయ యువజన విధానం 2014లో సమూల మార్పులు
- యువకులలో క్రీడా కార్యక్రమాలను పెంపొందించేందుకు మరియు శిక్షణా సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాయోజితం కావించే క్రీడా సంస్థల ఏర్పాటు,

## షెడ్యూలు కులాలు మరియు తరగతుల సంక్షేమం

- జాతీయ, రాష్ట్ర స్థాయిలో వారి జనాభాకు అనుగుణంగా ప్రణాళికల్లో షెడ్యూలు కులాలకు స్పెషల్ కాంపొనెంట్ ప్లాన్, గిరిజనులకు ఉప్రణాళిల ఏర్పాటుకు కేంద్ర చట్టం రూపకల్పన. షెడ్యూలు కులాలు మరియు షెడ్యూలు తరగతులకు ప్రణాళికల అమలులో నేరుగా లబ్ధిపొందారా లేదా అన్న పర్యవేక్షణకు స్టాండింగ్ కమిటీ ఏర్పాటు
- ప్రయివేటు రంగంలో ఎస్‌సి మరియు ఎస్‌టిలకు రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్ర చట్టం రూపకల్పన
- వివక్షకు తావిచ్చే అన్ని అంశాలను చట్టపరిధిలోకి తెస్తూ ఎస్‌సి/ఎస్‌టిలపై అత్యాచారాల నిరోధ చట్టాన్ని మరింత పటిష్ట పరచటం

## షెడ్యూలు కులాలు

కుల వ్యవస్థ రద్దుకు మరియు అన్ని రకాల కుల అణచివేతనిర్మూలనకు *సిపిఐ(ఎం) గట్టిగా కట్టుబడి ఉంది. అందరికీ ఆరోగ్య హక్కు, విద్య, ఉపాధి, తగిన జీవన పరిస్థితులు మరియు భద్రత వంటి మౌలిక మానవహక్కులకు సంబంధించి అన్ని రంగాలలో ప్రత్యేక చర్యలను ప్రత్యేకించి షెడ్యూలు తరగతుల హక్కుల పురోగతికి అదనపు కేటాయింపులతో సహా దిగువ చర్యలు తీసుకోనేందుకు కట్టుబడి ఉంది.*

- నిర్ణీత కాల వ్యవధి నిర్ణయించి ప్రత్యేక రిక్రూట్‌మెంట్ జరిపి రిజర్వుడు సీట్ల మరియు పోస్టుల బ్యాక్‌లాగ్ అన్నింటినీ నింపటం మరియు ప్రమోషన్లకు చర్యలు తీసుకోవటం; షెడ్యూలు తరగతుల యువతకు వృత్తి విద్యా శిక్షణా సౌకర్యాలను కల్పించటం; స్వయం ఉపాధిద్వారా ఏర్పాటు చేసుకున్న షెడ్యూలు కులాల వారి సంస్థలన్నింటికీ రుణ సౌకర్యం కల్పించటం మరియు మార్కెట్ అనుబంధాల అభివృద్ధికి సాయపడటం
- అంటరాని తనం పాటించే వారికి వ్యతిరేకంగా, అత్యాచారాలకు మరియు వివక్షకు పాల్పడే వారికి వ్యతిరేకంగా బలమైన చర్యలు కఠిన శిక్ష
- చేతులతో పారిశుధ్య పనిని నివారించే చట్టంలోని లోపాలను సవరించేందుకు సవరణలు మరియు నిర్ణీత కాల వ్యవధిలో అలాంటి వారందరికీ పునరావాసం అందుకు తగిన కేటాయింపులు చేయటం
- పారిశుధ్య సేవలలో కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణ
- షెడ్యూలు కులాలు నివసించే ప్రాంతాలకు అన్ని షెడ్యూలు కులాల కుటుంబాలకు ఇళ్లపట్టాలు, ఇళ్లు, పారిశుధ్యం, మంచినీరు, ఆరోగ్యం, విద్యుత్ కనెక్షన్లు

కల్పించేందుకు కృషి మరియు ఇతర తరగతుల పౌరులు షెడ్యూలు కులాల మధ్య ప్రత్యేకించి ఇళ్లుమరియు పౌర సేవల మధ్య ఉన్న అంతరాన్ని తొలగించేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టం

- దళిత క్రైస్తవులు మరియు ముస్లింలకు రిజర్వేషన్ల సౌకర్యాలను విస్తరింపచేయటం

## షెడ్యూలు తరగతులు

షెడ్యూలు తరగతుల సంక్షేమం కోసం సిపిఐ(ఎం) దిగువ చర్యలు తీసుకుంటుంది.

- చట్టబద్ధమైన నిర్ణీత కాలవ్యవధి చట్రంలో అన్ని ప్రభుత్వ సేవలలో ఉన్న ఎస్‌టి రిజర్వుడు పోస్టుల భర్తీకి చర్యలు; ప్రయివేటు రంగంలో రిజర్వేషన్ల విస్తరణ
- ఆదివాసీల భూమి హక్కులకు రక్షణ మరియు చట్టవిరుద్ధ పద్ధతుల్లో భూమి కోల్పోయిన గిరిజనులకు భూ పునరుద్ధరణ
- షెడ్యూలు తరగతులు మరియు ఇతర సాంప్రదాయ అటవీ నివాసుల (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం 2006 పూర్తిగా అమలు; 1980వ సంవత్సరం గడువుగా నిర్ణయించి అంతకు ముందున్న ఇతర సంప్రదాయ అటవీ నివాసులను చేర్చేందుకు చట్ట సవరణ
- చిరు అటవీ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు నిర్ణయించేందుకు ఒక జాతీయ కమిషన్ ఏర్పాటు మరియు వాటిని సేకరించేందుకు అవసరమైన తగినన్ని ఆర్థిక వనరులు కల్పించటం
- గిరిజనుల కేంద్రీకరణ ఎక్కువగా ఉన్న అన్ని రాష్ట్రాలు మరియు దేశంలోని జిల్లాలలో అన్ని బ్లాకులకు పంచాయతీల చట్టాన్ని(షెడ్యూలు ఏరియాలకు విస్తరణ) విస్తరించటం; ఎక్కడైతే అలాంటి రక్షణ లేదో అక్కడ అన్ని రాష్ట్రాలలోని పట్టణ ప్రాంతాలు మరియు మున్సిపాలిటీలకూ విస్తరణ
- గిరిజనుల భాషలు, లిపులకు గుర్తింపు, రక్షణ కల్పించటం మరియు అభివృద్ధి చెందేట్లు చూడటం. గిరిజన భాషలైన భిలి, గోండీ వంటి వాటిని రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూలులో చేర్చటం; సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలతో ఆదివాసీల భాషలను అధికార భాషలుగా గుర్తింపచేయటం
- రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించిన గిరిజనుల జాబితాల ప్రకారం ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి వలస వచ్చిన నప్పటికీ వారి గిరిజన గుర్తింపు మరియు హక్కులు అయా రాష్ట్రాలలో కూడా వర్తింప చేసేందుకు ఆటోమాటిక్‌గా జాబితాలో చేర్పింపు

- ఆహార భద్రతా చట్టం కింద సబ్సిడీ ఆహార ధాన్యాలను పొందేందుకు గిరిజనులందరినీ చేర్చటం
- గిరిజన ప్రాంతాలలో మంచినీరు, పారిశుధ్య, ఆరోగ్య కేంద్రాలు, మరియు పాఠశాలలు,హాస్టళ్ల ఏర్పాటు
- తప్పుడు కేసులతో జైలు పాలైన అమాయక గిరిజనుల తక్షణ విడుదల మరియు పునరావాసం కల్పించటం

## మైనారిటీలు

*మైనారిటీల హక్కులు, సంక్షేమం కోసం సిపిఐ(ఎం) దిగువ చర్యలు తీసుకొనేందుకు పనిచేస్తుంది.*

- మైనారిటీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధ హోదా కల్పించటం, దాని అధికారాలు మరియు పరిధి, సభ్యులు మరియు చైర్మన్ స్థాయిలను పెంచటం
- సచార్ కమిటీ సిఫార్సుల అమలుకు గిరిజన ఉప ప్రణాలిక మాదిరి ముస్లిం మైనారిటీలకు ఒక ఉప ప్రణాళిక రూపొందించటం;ఉపాధి, విద్య, ఆరోగ్యం కోసం ముస్లిం జనాభా ఎక్కువగా కేంద్రీకృతమైన లక్షిత జిల్లాలలో ప్రత్యేక చర్యలు
- రంగనాధ మిశ్రా కమిషన్ నివేదిక సిఫార్సులు అమలు, తక్షణ చర్యగా ఆయా రాష్ట్రాల వారీ కేటాయింపుల ప్రకారం ఒబిసి ముస్లింలందరినీ ఒబిసి కోటాలలో చేర్పించటం
- బ్యాంకుల ప్రాధాన్యతా రుణాలలో ముస్లింలకు 15శాతం కేటాయింపు; స్వయం ఉపాధి పొందిన ముస్లిం యువతకు సబ్సిడీలతో కూడిన రుణాలు ఇప్పించేట్లు చూడటం
- ముస్లిం బాలికల విద్యకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వటం, వారికి స్కాలర్‌షిప్పులు మరియు హాస్టల్ వసతులను గణనీయంగా పెంచటం
- పాఠశాలలో ఉర్దూ బోధనకు ప్రోత్సాహం; ఉర్దూలో నాణ్యమైన పాఠ్య పుస్తకాల ప్రచురణ మరియు అన్ని ఉర్దూ బోధనా పోస్టుల భర్తీ
- ఉగ్రవాద కేసుల నుంచి విడుదలైన ముస్లిం యువకులకు పరిహారం మరియు పునరావాసం కల్పించటం, వారిని తప్పుడు కేసులలో పెట్టిన, చిత్రహింసలు తదితర ఇబ్బందులకు గురిచేసిన అధికారులను శిక్షించటం, అటువంటి కేసుల విచారణకు సత్వర న్యాయవిచారణ కోర్టుల ఏర్పాటు

## ఓబిసిలు

- కేంద్ర విద్యా సంస్థలలో 27శాతం ఓబిసి రిజర్వేషన్లను సక్రమంగా అమలు జరిపేందుకు చర్యలు; ప్రయివేటు విద్యా సంస్థలన్నింటికీ ఓబిసి రిజర్వేషన్ల వర్తింపు
- వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్ పటిష్టీకరణ
- ఓబిసి సర్టిఫికెట్లు పొందే ప్రక్రియను సరళతరం గావించటం
- షెడ్యూలు కులాలు మరియు తరగతుల మాదిరిగా సమగ్రమైన పథకాలు, పాకేజ్‌లను రూపొందించటం, ఓబిసిలలోని ఆర్థికంగా బలహీనులైన వారిని దారిద్ర్యం నుంచి బయట పడవేయటం

## అశక్తులైన వారి (వికలాంగులు) సంక్షేమం

పలు రకాలుగా అశక్తులైన వారి సంక్షేమం కోసం దిగువ చర్యలు చేపట్టాలని సిపిఐ(ఎం) కోరుతున్నది.

- అశక్తులైన వారికి సంబంధించి ఆరంగంలో వెల్లడైన అనేక ఆందోళనలు, అంశాల ఆధారంగా ఐక్యరాజ్యసమితిలో అశక్తులైన వారి హక్కుల సదస్సు చేసిన తీర్మానాలకు అనుగుణ్యంగా అశక్తుల బిల్లులో సవరణలు చేయటం,జాతీయ వైకల్యత విధానంలో సవరణలు
- సర్టిఫికెట్లు పొందటాన్ని సరళతరం కావించటం, అన్ని రాష్ట్రాలు, ప్రభుత్వ శాఖలలో చెల్లుబాటు అయ్యే విధంగా అంతటా చెల్లుబాటయ్యే గుర్తింపు కార్డులు అందచేయటం.ఒక నిర్ణీత కాల వ్యవధిలో ప్రభుత్వ శాఖలలోని బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ
- అన్ని ప్రభుత్వ భవనాలు, బహిరంగ స్థలాలు, రవాణా, సమాచార ఇతర రంగాలలో అశక్తులుగా ఉన్న వారికి ఆటంకాలు లేకుండా ప్రవేశం, పూర్తిగా ఉచితంగా అందుబాటులోకి తేవటం, సంజ్ఞలతో కూడిన భాషా దుబాసీల ఏర్పాటు, చెవిటి మరియు వినటానికి ఇబ్బంది పడే వారికి వారి భాషలోనే కాప్షన్లతో టీవీ కార్యక్రమాలను అందుబాటులోకి తేవటం
- అశక్తుల కనీస పెన్షన్ నాలుగువేలకు పెంపు
- పరికరాలు, సహాయ వస్తువులను ఉచితంగా అందించటం
- అన్ని స్థాయిలలో విద్యను అందుబాటులోకి తేవటం
- అశక్తులైన వారికి ఆరోగ్యవసతులను అందుబాటులోకి తేవటం ఉచితంగా

అందించటం
- కేవలం త్రిచక్ర సైకిళ్లు, చక్రాల కుర్చీలు, కృత్రిమ అవయవాలనే కాగా అశక్తులైన వారికి తోడ్పడే ఇతర పరికరాలు, సౌకర్యాల ఏర్పాటు కూడా ఎంపీ నిధుల కింద సహాయం చేయటానికి పరిధి విస్తరణ

# ప్రజా సంక్షేమ చర్యలు

## ఉపాధి హామీ పథకం

అన్ని పట్టణాలలో ఉపాధి హామీ పథకం కోసం చట్టాన్ని తేవటం
- కుటుంబంలోని పెద్ద వారందరికీ వారు కోరినన్ని రోజులు ఉపాధి కల్పించే విధంగా చట్టాన్ని సవరించటం
- గ్రామీణ ప్రాంతాలలో జీవనాన్ని మెరుగు పరిచేందుకు దోహదం చేసే అన్ని రకాల పనులను రేగా పరిధిలో జరిగేట్లు విస్తరించటం
- నిర్ణీత వ్యవధిలో చట్టబద్ధమైన కనీస వేతనాల చెల్లింపు; న్యాయమైన మరియు వాస్తవానికి దగ్గరగా ఉండే షెడ్యూలు రేట్లను ప్రకటించటం;ధరల పెరుగుదలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు వేతనాలను పెంచటం; బ్యాంక్ ఖాతా లేదా ఆధార్ నంబర్ కావాలని వత్తిడి చేయకుండా ఒక నిర్ణీత క్రమంలో వేతనాలను చెల్లించటం; నిరుద్యోగభృతి చెల్లింపు ప్రక్రియను సులభతరం చేయటం మరియు అందేట్లు చూడటం

## విద్య

- విద్యపై ప్రభుత్వ ఖర్చును జిడిపిలో ఆరుశాతానికి పెంచటం
- ఉచిత మరియు నిర్బంధ ప్రాథమిక విద్యను అందించేందుకు విద్యా హక్కు చట్టాన్ని అమలు జరపటం;నివసించే ప్రాంతాలలో ఏ స్కూలులో అయినా చేరేందుకు వీలు కల్పించే అవగాహనను వ్యవస్థాగతం కావించేందుకు వీలుగా విద్యా హక్కు చట్టాన్ని సవరించటం; ప్రాథమిక స్థాయి నుంచి ఎగువ స్థాయికి కొనసాగించే విద్యార్థులందరికీ ఉచిత విద్యను అందించటం; ఆర్థికంగా బలహీన వర్గాల విద్యార్థులకు ప్రవేశాలు కల్పించటంలో విఫలమైన ప్రయివేటు పాఠశాలలు మరియు ప్రత్యేక సంస్థలపై కఠిన చర్యలు; పాఠశాలల మరియు టీచర్ల నాణ్యత మెరుగుపరచటం, విద్యా హక్కు అమలుకు అయ్యేఖర్చులో ఎక్కువ భాగం కేంద్ర ప్రభుత్వం భరించే విధంగా చూడటం
- మధ్యలో చదువు మానివేసే వారిని తగ్గించేందుకు హైస్కూలు విద్యను విస్తరించటం; విద్య నాణ్యతను మెరుగు పరచటం మరియు సర్వశిక్షా అభియాన్ పాఠశాలల్లో

మౌలిక సౌకర్యాల ఏర్పాటు, వెనుబడిన ప్రాంతాల,ఇతరంగా ప్రధాన స్రవంతికి దూరంగా ఉన్న తరగతులకు చెందిన పిల్లలను నిలబెట్టుకోవటం వంటి ఇతర అంశాలలో నిబంధనలు, పాఠశాల సమయాల వంటి వాటిలో సరళత్వాన్ని అనుమతించటం.

- ప్రయివేటు విద్యా సంస్థలలో ఫీజులు, ప్రవేశాలు మరియు సిలబస్ క్రమబద్ధీకరణకు చట్టం చేయటం
- ఉన్నత విద్యలో ఎఫ్‌డిఐలకు అనుమతి ఉండదు; విదేశీ విద్యా సంస్థల ప్రవేశం, కార్యకలాపాల క్రమబద్ధీకరణ బిల్లు 2010, ఉన్నత విద్య మరియు పరిశోధన బిల్లు 2011 మరియు పరిశోధన మరియు నవీకరణకు విశ్వవిద్యాలయాలు బిల్లు 2012 వంటివి రద్దు.
- నాలుగు సంవత్సరాల బ్యాచిలర్ కోర్సు రద్దు, ప్రయివేటు ఉన్నత విద్యా సంస్థలలో విద్యానాణ్యతను పెంచేవిధంగా, అందుబాటును పెంచే విధంగా ఫీజులు మరియు టీచర్ నిబంధనలను సరిచేయడం.
- భారత సామాజిక మరియు సాంస్కృతిక వైవిధ్యం గుర్తించబడే విధంగా అన్ని స్థాయిల విద్యలో ప్రజాస్వామ్య మరియు అభ్యుదయకర పాఠ్య ప్రణాళిక మరియు పాఠ్యాంశాల రూపకల్పన
- ప్రస్తుతం కాంట్రాక్టు లేదా పారా టీచర్లుగా ఉన్న వారిని రెగ్యులరైజ్ చేయటం
- అన్ని విద్యా సంస్థలలో విద్యార్థుల, టీచర్ల, మరియు బోధనేతర సిబ్బంది ప్రజాస్వామిక హక్కులు అమలయ్యేట్లు చూడటం; అన్ని ఉన్నత విద్యా సంస్థలలో విద్యార్థి యూనియన్ ఎన్నికలను విధిగా జరిపేట్లు చూడటం

## ఆరోగ్యం

- కేంద్ర ప్రభుత్వం నుంచి గణనీయమైన కేటాయింపులతో పాటు ఆరోగ్యానికి కనీసంగా జిడిపిలో ప్రభుత్వ ఖర్చును ఐదుశాతానికి పెంచటం
- ఒక పరిధిలోని సమగ్ర ఆరోగ్య సంరక్షణ సేవలు అందుబాటులోకి తేవటం మరియు ఉచితంగా అందించే విధంగా స్థానికులకు జవాబుదారీగా ఉండే విధంగా ప్రజారోగ్య వ్యవస్థను పటిష్టపరచటం మరియు విస్తరించటం
- ఆరోగ్య సేవల ప్రయివేటీకరణను, పిపిపిల ద్వారా పొరుగుసేవలను పొందటాన్ని, ప్రయివేటీకరణ ధోరణులను తక్షణమే వెనక్కు కొట్టటం
- కార్మికుల ఆరోగ్యాన్ని సమర్ధవంతంగా రక్షించే విధంగా ఇఎస్ఐ పథకాన్ని విస్తరించటం, కొత్త రూపం ఇవ్వటం
- ప్రయివేటు ఆరోగ్య సంరక్షణ క్రమబద్ధీకరణ, ప్రత్యేకించి కార్పొరేట్‌ల

యాజమాన్యంలోని ఆసుపత్రుల రంగంపై తక్షణమే మరియు కఠిన చర్యలు

- అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో నిరంతరాయంగా ఉచిత మందుల సరఫరా, ప్రమాదకరమైన ఔషధాలను మార్కెట్ నుంచి తొలగించటం
- అత్యవసరమైన ఔషధాలకు ఖర్చు ఆధారిత ఫార్ములా ప్రకారం ఔషధాల ధరలపై నియంత్రణ; జాతీయ జాబితాలో ఉన్న అన్ని ఔషధాలపై అన్ని రకాల పన్నుల రద్దు మరియు కనీస ఖర్చు-ఎంఆర్‌పి లాభం ఉండేట్లు చూడటం, ఎంఆర్‌పి ప్రాతిపదికన గాక వసూలు చేసిన ధర ప్రాతిపదికన ఔషధాలపై ఎక్సైజ్ డ్యూటీని భారీగా తగ్గించటం
- అత్యవసర ఔషధాల ఉత్పత్తి, ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వ రంగంలోని ఫార్మాస్యూటికల్ యూనిట్ల పునరుద్ధరణ
- క్లినికల్ ప్రయోగాల క్రమబద్ధీకరణ, గట్టిగా అదుపుచేయటం మరియు విదేశీ ఫార్మాస్యూటికల్ కంపెనీలు అనైతిక పద్ధతుల్లో నిర్వహిస్తున్న క్లినికల్ ప్రయోగాలపై నిషేధం
- భారత్ నుంచి అమెరికా ప్రభుత్వ ఔషధ నియంత్రణ ఏజన్సీ యుఎస్ ఎఫ్‌డిఏ కార్యాలయాలు మరియు సిబ్బంది తొలగింపు, భారత గడ్డపై అమెరికా చట్ట అమలు చెల్లదు
- భారత పేటెంట్ చట్టాలకు మద్దతు మరియు వాటిని నీరుగార్చకుండా చూడటం
- ప్రభుత్వ ఆధ్వర్యంలో వైద్యులు, నర్సుల శిక్షణకు కొత్త కాలేజీల ఏర్పాటుకు ప్రాధాన్యత. అటువంటి కాలేజీలు పేద రాష్ట్రాలు మరియు సేవలు తక్కువగా పొందుతున్న ఈశాన్య రాష్ట్రాలలో ఏర్పాటుకు ప్రాధాన్యత మరియు ప్రభుత్వ నిధుల అందచేత. ఆరోగ్య సిబ్బంది శిక్షణా సంస్థల ఏర్పాటు

## ఆధార్

- పార్లమెంట్ ఆమోదం పొందేంత వరకు ఆధార్ పథకం నిలిపివేత; ఆధార్ అమలుకు ముందు పార్లమెంటులో గోప్యత చట్టం మరియు సమాచార రక్షణ చట్టం ఆమోదం
- సామాజిక సేవలకు ఆధార్ వినియోగంపై నిషేధం మరియు పౌరులకు అందించే ఆర్థిక మరియు సామాజిక సేవలు, ఏవైనా హక్కులకు ఆధార్‌ను తప్పనిసరి చేసే అన్ని నిర్ణయాల రద్దు
- ఈ ప్రాజెక్టులో వినియోగించిన బయోమెట్రిక్ టెక్నాలజీ మదింపునకు ఉన్నత స్థాయి స్వతంత్ర నిపుణుల కమిటీ ఏర్పాటు

## పెన్షన్లు మరియు వృద్ధులు

- వృద్ధులు గౌరవ ప్రదంగా జీవించేందుకు అందరికీ వర్తించే మరియు ఎలాంటి

చెల్లింపులు లేని వృద్ధాప్య పెన్షన్ వ్యవస్థ ఏర్పాటుకు ప్రభుత్వ నిధులతో కూడిన ఏర్పాటు, కనీస వేతనంలో సగానికి తగ్గకుండా లేదా నెలకు నాలుగు వేల రూపాయలు ఏది ఎక్కువైతే ఆ మొత్తం చెల్లించేట్లు చూడటం, ఇతర వనరుల నుంచి అధిక పెన్షన్ పొందే వారు మరియు ఆదాయ పన్ను చెల్లించేవారికి తప్ప అందరికీ వర్తింపు

- ధరల సూచికకు అనుగుణంగా ఏడాదికి ఒకసారి పెన్షన్ సవరింపు
- వృద్ధాప్య పెన్షన్లకు ఏక గవాక్ష వ్యవస్థ ఏర్పాటు
- ఎలాంటి వయస్సు పరిమితి లేకుండా వితంతువులు, అనాధలు మరియు అశక్తులైన వారికి వర్తించే అలవెన్సులు అందరికీ వర్తింపు
- జీవన వ్యయానికి అనుగుణ్యంగా అన్ని తరగతుల పెన్షన్‌దార్లకు పెన్షన్ల పెంపుదల, మాజీ సైనికులకు ఒకే ర్యాంక్ ఒకే పెన్షన్
- రాజ్య మద్దతుతో వృద్ధాప్య గృహాలు/పగటి పూట సంరక్షణ కేంద్రాల నెట్‌వర్క్ నిర్మాణం•

## పట్టణ సమస్యలు

*దేశంలోని పట్టణ ప్రాంతాలలో పేదలు, కార్మికవర్గం పెరుగుతున్న కారణంగా వారి సంక్షేమానికి దిగువ చర్యలు తీసుకోవాలని సిపిఐ(ఎం) కోరుతున్నది.*

- పథకం ప్రకారం పట్టణీకరను ప్రోత్సహిస్తుంది.పట్టణాలకు వలస వచ్చే పౌరుల పెరుగుదలకు అనుగుణంగా వారికి సదుపాయాలు కలిగించేందుకు ప్రభుత్వ పెట్టుబడులను పెంచాల్సి ఉంది.
- పట్టణ పేదలు భరించగలిగిన విధంగా మౌలికసేవలైన మంచినీరు, పారిశుధ్యం, విద్యుత్, రవాణా, రేషన్ దుకాణాలు, ఆరోగ్య సదుపాయాలు, పాఠశాలలు, వీధి లైట్ల వంటి వాటిని సమకూర్చవలసి ఉంది.
- అభాగ్యులు, సాయపడదగిన వారికి రాత్రుళ్లు వసతి కల్పించటం, సామూహిక భోజన శాలల ఏర్పాట్లు, నిర్వహణకు తగినన్ని నిధుల కేటాయింపు.
- మురికి వాడల కూల్చివేతల నిలిపివేత, సదుపాయాలతో కూడిన నివాసాల అభివృద్ధి, మురికి వాడలను రియలెస్టేట్ డెవలర్స్‌కు అప్పగించకుండా చూడటం
- తమ పని స్థలాల నుంచి దూరంగా శివారు ప్రాంతాలకు కార్మికుల తొలగింపు మరియు వేరేచోట నివాసాల ఏర్పాటుపై పూర్తి నిషేధం
- పూర్తి పౌర సౌకర్యాలతో ప్రభుత్వ గృహాల విస్తరణ, ధనిక తరగతులకు ఉపయోగపడే అదుపులేని రియలెస్టేట్ అభివృద్ధి పరిమితం చేయటం
- భరించగలిగిన ధరల్లో ఆధునిక పౌర రవాణా, పెద్ద సంఖ్యలో రవాణా చేయగలిగిన వ్యవస్థల అభివృద్ధి; పాదచారులు, సైకిళ్లపై తిరిగే వారికి, వేగం తక్కువగా ఉండే

ఇతర వాహనాల వారికి తగిన విధంగా ప్రణాళికా బద్ధమైన రోడ్లు, వాయు కాలుష్య నియంత్రణ మరియు ఈ చర్యల ద్వారా రోడ్లపై రద్దీ తగ్గింపు
- తిరిగి వినియోగించటానికి/రీసైకిల్ చేయటానికి చెత్త యాజమాన్యంలో ప్రత్యేక దృష్టి పెట్టటం, హానికరమైన ఎలక్ట్రానిక్/రసాయన మరియు బయో వ్యర్థాలను తొలగించేందుకు పిపిపిలతో నిమిత్తం లేకుండా ఎస్‌డబ్ల్యుఎం కార్మికుల సహకారం సంస్థలకు ఇవ్వటం
- వీధి విక్రేతలకు రక్షణ కల్పించటం

## పర్యావరణం

- రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో సమర్థవంతంగా, నిర్ణీత వ్యవధిలో, పారదర్శకంగా, జవాబుదారీతన మరియు ఎలాంటి స్వ ప్రయోజనాలు లేని రీతిలో వ్యవస్థల పనితీరు ఉండే విధంగా చూడటం
- సమర్ధవంతమైన చర్యలు తీసుకోవటం ద్వారా గ్రీన్‌హౌస్ గ్యాస్‌లను తగ్గించేందుకు కృషి, అన్ని ఉత్పత్తి, వినియోగ రంగాలలో ఇంధనాన్ని సమర్ధవంతంగా వినియోగించడం, పునరుత్పాదక ఇంధనమైనటువంటి సౌర, వాయుశక్తికి ప్రోత్సాహం, ఇంధన వినియోగంలో అసమానతల తగ్గింపు మరియు ఆర్థికంగా బలహీన వర్గాల వారికి ఇంధన వనరులు అందుబాటులోకి తేవటం
- సహజ మరియు వాతావరణ సంబంధిత విపత్తులను ఎదుర్కొనేందుకు రాష్ట్రాలను పటిష్టపరచటం మరియు వాతావరణానికి అనుగుణ్యమైన అభివృద్ధి వ్యూహాలు అమలు అసహాయులుగా ఉండే పౌరుల అవసరాలను తీర్చటం
- సమర్ధవంతమైన క్రమబద్ధీకరణ మరియు అమలు చేయటం ద్వారా ప్రత్యేకించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల క్రమబద్ధీకరణల అథారిటీల ద్వారా నదులు ఇతర నీటి వనరుల కాలుష్యాన్ని అరికట్టటం
- నదుల కరకట్టలు మరియు లోతట్టు ప్రాంతాల కోతను నిరోధించటం మరియు ఆ ప్రాంతాలలో వినాశకర అభివృద్ధిని అరికట్టటం
- మాధవ్ గాడ్గిల్ మరియు కస్తూరి రంగన్ రిపోర్టుల అమలు నిలిపివేత మరియు లబ్ధిదారులతో విస్తృతమైన సంప్రదింపులు, బహిరంగ విచారణలు జరపటం ద్వారా పశ్చిమ కనుమల్లోని సున్నితమైన పర్యావరణ వ్యవస్థ, పౌరుల జీవనాల రక్షణకు అవసరమైన సమగ్ర పథకాన్ని రూపొందించేందుకు విశాలమైన నిపుణుల కమిటీ ఏర్పాటు

## జలవనరులు

- నీటిని అరుదైన ప్రజా సరకుగా పరిగణిస్తూ ఒక నూతన జాతీయ నీటి విధానం

రూపొందించుట, ఆ విధంగా నీటి రీఛార్జి మరియు నీటి పొదుపు, మొత్తంగా గృహ వినియోగానికి అదనంగా నీటిని అందుబాటులోకి తేవటం, వ్యవసాయం మరియు పరిశ్రమల వినియోగంపై సమర్ధవంతమైన క్రమబద్దీకరణ మరియు డిమాండ్ యాజమాన్యం; ప్రాధాన్యతా క్రమంలో నివాసులందరికీ సమంగా మంచినీటి సౌకర్యం కల్పన

- నీటి ప్రయివేటీకరణ ఉండదు
- సమర్ధవంతమైన క్రమబద్దీకరణ ద్వారా భూ గర్భ జలాలు తగ్గిపోకుండా చూడటం, తగిన చట్టాలు చేయటం క్రమబద్దీరణ సంస్థలను పటిష్ట పరచటం

## సైన్సు మరియు సాంకేతిక పరిజ్ఞానం

- ప్రస్తుతం ఉన్న 0.8శాతాన్ని జడిపిలో రెండు శాతానికి శాస్త్ర, సాంకేతిక రంగాలలో దేశీయ పరిశోధనకు ప్రభుత్వ నిధులను పెంచి స్వయం సమృద్ధిని పెంపొందించటం; పరిశోధన మరియు అభివృద్ధిలో విశ్వవిద్యాలయాల వ్యవస్థను పటిష్ట పరచటం, ప్రాధాన్యతలకు అనుగుణంగా శాస్త్రాలలో మౌలిక పరిశోధనలు చేయటం
- సోలార్ వంటి అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీలజీ మెరుగుదలకు నూతన చొరవలకు తగిన నిధులు కేటాయించటం
- మైక్రో ఎలక్ట్రానిక్స్‌తో సహా ఎలక్ట్రానిక్స్ సామర్థ్యాన్ని సృష్టించటం
- కీలకమైన రంగాలలో బహుళజాతి ఔషధ గుత్త సంస్థల గుత్తాధిపత్యాన్ని దెబ్బతీసేందుకు చొరవ తీసుకొనే కార్యక్రమాలు
- విత్తనాలలో మోన్‌శాంటో వంటి కంపెనీల గుత్తాధిపత్యాన్ని దెబ్బతీసేందుకు వ్యవసాయ పరి శోధనపై కేంద్రీకరణ
- కాపీరైట్స్ లేదా పేటెంట్ ద్వారా గుత్త యాజమాన్యాల నుంచి తప్పించేందుకు ఫ్రీ సాఫ్ట్‌వేర్ మరియు అలాంటి నూతన సాంకేతిక పరిజ్ఞానానికి ప్రోత్సాహం, బయోటెక్నాలజీ మరియు ఔషధాలను కనుగొనటంలో అన్ని విభాగాలలో జ్ఞానాన్ని పెంపొందించే నెట్‌వర్క్‌ల ఏర్పాటుకు ప్రోత్సాహం
- భారత పేటెంట్ చట్టానికి గట్టిగా కట్టుబడి ఉండేందుకు వీలుగా పనిచేసేందుకు పేటెంట్ కార్యాలయాలను పటిష్టపరచటం, భారత పేటెంట్ కార్యాలయాల సిబ్బందికి అమెరికా మరియు ఐరోపా పేటెంట్ కార్యాలయాలతో శిక్షణ, పునశ్చరణ ఇప్పించటం నిలిపివేయాలి.

## సంస్కృతి మరియు మీడియా

- రాజ్యాంగం ఎనిమిదవ షెడ్యూలులో ఉన్న అన్ని భాషలను ఒకే విధంగా ప్రోత్సహించటం మరియు అభివృద్ధి చేయటం

- లౌకిక, అభ్యుదయ మరియు ప్రజాస్వామిక సంస్కృతులకు ప్రోత్సాహం; సాంస్కృతిక రంగాలకు చెందిన ప్రముఖులు, వారి ఉత్పాదనలపై మతోన్మాదుల దాడుల పట్ల కఠినంగా వ్యవహరిస్తుంది.
- హింసను శ్లాఘించటాన్ని మహిళలు, సెక్స్‌ను వాణిజ్యవస్తువుగా మార్చటాన్ని కట్టడి చేస్తుంది.
- టీవీ, రేడియోలు నిజమైన ప్రభుత్వ ప్రసార సేవలను అందించేందుకు ప్రసార భారతి కార్పొరేషన్ పటిష్టీకరణ; ప్రభుత్వ ప్రసార సేవలలో రాష్ట్రాలకు అధికారం ఉంటుంది.
- గుత్తాధిపత్యాన్ని నిరోధించేందుకు బహుళమీడియా యాజమాన్య నిరోధం; ప్రచురణ మరియు ఎలక్ట్రానిక్ మీడియాలోకి ఎఫ్‌డిఐల ప్రవేశం రద్దు
- మీడియా కౌన్సిల్ ఏర్పాటు, అది స్వతంత్ర మీడియా క్రమబద్ధీకరణ అథారిటీగా పనిచేస్తుంది.
- ఇంటర్నెట్ పర్యవేక్షణ అధికారాన్ని అమెరికా నుంచి తొలగించి తగిన అంతర్జాతీయ సంస్థకు అప్పగించేందుకు కృషి; ప్రపంచ కార్పొరేషన్ల అదుపు నుంచి విముక్తి చేసి ప్రజల కేంద్రంగా సామాజిక న్యాయాన్ని కలిగించేదిగా చూడటం, గోప్యత హక్కును కాపాడే మరియు ఏ ప్రభుత్వం కూడా సామూహిక నిఘావేసేందుకు అవకాశం లేకుండా పర్యవేక్షక సంస్థ పనిచేసే విధంగా చూడటం

# సంస్థాగత సంస్కరణలు

అన్ని రకాల ప్రత్యేకించి ఉన్నత స్థానాలలో అవినీతి నిరోధ మరియు అదుపు చర్యలకు సిపిఐ(ఎం) నిలబడుతుంది. సమర్ధవంతంగా ఇబ్బందుల పరిష్కారం, అవినీతి అక్రమాలను వెల్లడించే వారికి రక్షణ, సిబిఐ, సివిసిలకు స్వతంత్ర ప్రతిపత్తి కలిగించటం, న్యాయం అందరికీ అందుబాటులోకి తేవటం, మరియు వేగంగా అందించటం, ఎన్నికల క్రమం నుంచి కార్పొరేట్ మరియు ధనికుల పాత్ర తొలగింపునకు సంస్కరణలు, చర్యలు తీసుకోవటం.

## అవినీతిపై పోరాటం మరియు జవాబుదారీ తనం పెంచటం

- ప్రభుత్వం మరియు ప్రయివేటు రంగం మధ్య ఎలాంటి అవగాహన లేదా ఒప్పందాలు, కాంట్రాక్టులు జరిగినప్పటికీ వాటన్నింటినీ లోక్‌పాల్ పరిధిలోకి తెచ్చేందుకు దానిని విస్తరించటం మరియు అవినీతి నిరోధక చట్టాన్ని సవరించి పటిష్టపరచటం
- కార్పొరేట్ నేరాలను క్షుణ్ణంగా విచారించేందుకు దర్యాప్తు సంస్థలు మరియు రెగ్యులేటర్లకు సాధికారత కల్పించటం
- ప్రయివేటు ఆర్థిక రంగ సంస్థలు బాంకింగ్ మరియు ప్రత్యేకించి బీమారంగం

మరియు అన్ని ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్య ప్రాజెక్టులను లోక్‌పాల్ చట్ట పరిధిలోకి తేవాలి. అవినీతిని బయటపెట్టేవారి రక్షణ చట్టం మరియు సంబంధిత అవినీతి నిరోధ చట్టాలు

- ప్రతి ప్రభుత్వ అధారిటీకి వివరమైన పౌర హక్కుల వివరాలను రూపొందించి ఇబ్బందుల నివారణ అధికారాలను కలిగించేందుకు చట్టం
- సమాచార హక్కు వినియోగదారులు మరియు అవినీతి నిరోధక ఉద్యమకారులకు రక్షణ కల్పిస్తూ సమర్థవంతమైన యంత్రాంగాల ఏర్పాటు మరియు అవినీతి అక్రమాలను బయట పెట్టేవారి రక్షణకు పటిష్టమైన చట్టం ఏర్పాటు
- సమాచార హక్కు చట్టాన్ని పటిష్టపరచటం

## ప్రధాన రాజ్యాంగ మరియు చట్ట సంస్కరణలు

- ఒక రాష్ట్రాన్ని విభజించబోయే లేదా పార్లమెంట్ పునర్వ్యవస్థీకరించబోయే ముందు సంబంధిత రాష్ట్ర చట్టసభల అంగీకారం తీసుకొనే వీలుకల్పిస్తూ రాజ్యాంగంలోని ఆర్టికల్ మూడుకు సవరణ.
- ఏ అంతర్జాతీయ సంధి అయినా విధిగా పార్లమెంట్ ఆమోదం పొందే విధంగా రాజ్యాంగ సవరణ
- సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని రద్దు చేయాలి. దాని స్థానంలో నిరంకుశ అధికారాలు లేకుండా ఒక చట్టపరిధిలో సాయుధ దళాల కార్యకలాపాలకు తగిన విధంగా ఒక చట్టాన్ని రూపొందించాలి.
- భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 377ను సవరించాలి. అది లైంగిక దృష్టితో సంబంధం లేకుండా వయోజనులు అంగీకృతమైన సంబంధాలను కలిగి ఉండటాన్ని అది నేరపూరితమైనదిగా చేయకూడదు.
- మరణశిక్షను రద్దు చేసేందుకు భారతీయ శిక్షా స్మృతి మరియు ఇతర చట్టాల నుంచి తొలగించాలి.

## న్యాయ సంస్కరణలు

- న్యాయ జవాబుదారీతనాన్ని గట్టి పరిచేందుకు మరియు న్యాయమూర్తుల నియామకం, బదిలీ, తొలగించేందుకు అధికారాలు కలిగిన ఒక స్వతంత్ర రాజ్యాంగ సంస్థను ఏర్పాటు చేసేందుకు న్యాయ, కార్యనిర్వాహక,చట్ట సభలు మరియు బార్‌ల ప్రతినిధులతో కూడిన ఒక జాతీయ న్యాయ కమిషన్ ఏర్పాటు.
- సామాన్యులు భరించదగిన ఖర్చుతో వేగంగా ఉపశమనం కలిగించే విధంగా న్యాయవ్యవస్థను సంస్కరించటం.

- అసమ్మతిని అణచివేయటాన్ని దుర్వినియోగం చేయకుండా ఉండేందుకు నేర ఉల్లంఘన నిర్వచనాన్ని తగిన విధంగా సవరించటం.
- న్యాయమూర్తులు తమ ఆస్తులను బహిరంగంగా ప్రకటించటాన్ని విధిగా చేయటం

## ఎన్నికల కమిషన్ సంస్కరణ

- ప్రధాని, ప్రతిపక్ష నేత, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ సలహాపై రాష్ట్రపతి ఎన్నికల కమిషన్ సభ్యులను నియమించటం
- ఎన్నికల కమిషనర్ల పదవీ కాలం పూర్తి అయిన తరువాత ప్రభుత్వ పదవి లేదా గవర్నర్, లేదా పార్లమెంట్ సభ్యులుగా పనిచేయకుండా చట్టబద్ధంగా అనర్హులను గావించటం.
- ఎన్నికల పరిశీలకుల పరిధిని స్పష్టంగా పేర్కొనేందుకు ప్రజాప్రాతినిధ్య చట్ట సవరణ
- ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వంతో వైరుధ్యాలను నివారించేందుకు శాంతిభద్రతల విషయంలో ఎన్నికల కమిషన్ పరిధిని స్పష్టీకరించేందుకు రాజ్యాంగ సవరణ

## ఎన్నికల సంస్కరణలు

- పార్టీల పాక్షిక జాబితాలతో దామాషా ప్రాతినిధ్యం
- నేర చరిత్ర ఉన్న వ్యక్తులను ఎన్నికలలో పోటీ చేయనివ్వకుండా గట్టి చర్యలు తీసుకోవటం
- గుర్తించబడిన పార్టీలకు మెటీరియల్ రూపంలో ప్రభుత్వ నిధుల ఎన్నికల ఫండింగ్.
- రాజకీయ పార్టీలకు కార్పొరేట్ నిధులపై నిషేధం


వెల : ₹ 5/-

ప్రతులు : 10,000

ప్రచురణ కర్త :

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తరపున

జె. జయరాం, హౌస్ నెం. 1-1-60/2, యం.బి.భవన్,

ఆర్‌టిసి క్రాస్ రోడ్స్, ముషీరాబాదు, హైదరాబాద్ -20